POSTAL REGD.NO.PRAKASAM/16/2021-2023
REGD.NO. 37926/83
ESTABLISHED : 1983
ఆగస్టు 2022
వెల – ₹ 10.00

# సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

సంపుటి: 40 సంచిక: 04



## ఈ నెల పండుగలు

**ఆగస్టు *17* - శ్రీ హజరత్ తాజుద్దీన్ బాబా ఆరాధన**
**ఆగస్టు *19* - శ్రీ కృష్ణాష్టమి**
**ఆగస్టు *24* - శ్రీ గొలగమూడి వెంకయ్యస్వామి ఆరాధన**
**ఆగస్టు *27* - శ్రీ ఆనందమయి అమ్మ ఆరాధన**
**ఆగస్టు *31* - వినాయక చవితి**
**ఆగస్టు *31* - శ్రీ శ్రీపాద శ్రీవల్లభ స్వామి జయంతి**

---

**భూ**మినుండి సారాన్ని, మేఘాలనుండి జలాన్ని, సూర్యునినుండి రశ్మిని, వాయువును పొందిన ప్రతిమొక్కా, వృక్షమూ తక్కిన జీవులకు ఏదో ఒకవిధంగా ఉపకరిస్తూనే ఉన్నది. భూమిని సారవంతంగా నిలువుకోడానికి ప్రతిమొక్క ఉపకరిస్తుందని నేటి విజ్ఞానశాస్త్రం చెబుతున్నది. మనకు నిరుపయోగంగా కన్పించే వృక్షజాలంకూడా మనం విసర్జించిన బొగ్గుపులుసు వాయువు స్వీకరించి ప్రాణవాయువును ప్రసాదించి, సూర్యుని యొక్క అధికమైన ఉష్ణాన్ని గ్రహించి మనకు సమశీతోష్ణాన్ని ప్రసాదిస్తుంది. నీడనూ, కట్టెలనూ, ఆకులనూ యిస్తాయి. ఎన్నో ప్రాణుల కాశ్రయమౌతాయి. ఇలా గడ్డిపోచనుండీ మహావృక్షం దాకా, సూక్ష్మజీవినుండి బృహత్తరమైన జంతుజాలం వరకూ సర్వమూ సాటిజీవుల హితానికి ఉపకరిస్తుంటే అట్టి శ్రేయస్సును నిరంతరం పొందుతూ కూడా సాటి ప్రాణుల కెట్టి శ్రేయస్సునూ చేయకుండా, ప్రతిదీ మన ఒక్కరికుపకరించే రీతిన జరగాలని కోరినపుడు మనం సాటిలేని నేరస్థులమౌతాము, శిక్షార్హులమౌతాము. **అయినా సద్గురువు కరుణామూర్తి గనుక శిక్షించక ప్రేమతో శిక్షణనిచ్చి, సంస్కరించి కృపార్హులమయ్యేలా చేయజూస్తాడు.**

**పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ**

---

# సత్సంగాలెందుకు?

**పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ**

'శ్రీ గురుచరిత్ర' చదివేవారికి ఒక విషయం వింతగా తోస్తుంది. అనేకసార్లు శ్రీగురుడు "ఇక్కడ మా మహిమ వెల్లడయింది. స్వార్థంతో దుర్మార్గులు కూడా వచ్చి యిచ్చటి భక్తులను బాధిస్తారు. నేనీచోటు విడిచి పోవాలి" అని చెప్పి అనేకచోట్లు వదిలివెళ్ళిపోయారు. అవును. భక్తులనెవరు బాధించటమూ వారు సహించలేరు. అది తప్పించటానికి వారెంతో శ్రమపడైనా యింకొక చోటికి వెళ్ళిపోతారు. భగవంతుని వలె వారు గూడ తమను బాధించినా సహిస్తారుగాని, తన భక్తులను బాధిస్తే సహించలేరు. అయితే వారు దయామయులు గనుక వారుగా ఆ దుష్టులను శిక్షించరుగాని భక్తులను బాధించిన పాపం అపారమైనది. దాని పర్యవసానం చాలా ఘోరంగా వుంటుంది. "శివేఋష్టే గురుస్త్రాత్ర, గురో రుష్టే నకశ్చన" అని గురుగీత చెప్పినట్లు "శివుడు కోపించినా గురువు రక్షించగలడుగాని గురువుకోపిస్తే ఎవరూ రక్షించలేరు."

'సాయిబాబా జీవితచరిత్ర', 'శ్రీ గురుచరిత్ర' పారాయణ, సత్సంగాలు, దత్తక్షేత్రాల దర్శనము చేసుకొనే మనం యిలాంటి అంశాలెన్నో తెలుసుకొని తీరాలి. చేతులు, ఒళ్ళుకాల్చుకొనకుండా వంట చేసుకొనగలగడం నేర్చుకోకుండా వంటకు దిగగూడదు. పథ్యం చేయలేకుంటే మందు తీసుకొనకుండడం మంచిది. అలానే మన నడవడిని సంస్కరించుకోకుండా మహాత్ములసేవ మొదలైన సాధనలు చేయడం ప్రమాదకరం. ఒక సద్గురు భక్తుడు సద్గోష్ఠి చేస్తూంటే వృద్ధులైన ఒక వేదపండితులు గూడ వచ్చారు. సగౌరవంగా వారికి ఆ భక్తుడు తమ చెంతనే కుర్చీవేస్తే ఆయన దానిని దూరంగా లాక్కొని కూర్చుని ఒక శ్లోకం చదివారు. దాని భావం, "స్త్రీ, అగ్ని, సద్భక్తుడు — వీరికి తగినంత దూరంలో వుండాలి" అని చెప్పారు. వీటిలో మొదటి రెండూ అందరికీ తెలిసినవే. మూడవది: అతి సన్నిహితం వలన వారి పట్ల రాగము, ద్వేషము, యీర్ష్య, వాటి వలన తప్పులెన్నే దృష్టి ఏర్పడతాయి. సద్గురువుపై ఏకాగ్రత సాధించుకోడానికి యత్నిస్తున్న మనకు అటు తర్వాత కించిత్తైనా మనసు సాధన వైపుకు తిరగక యిట్టి దుష్ప్రవర్తనలోనే నిమగ్నమౌతుంది. అందువలన మనం చేసుకున్న పుణ్యమంతా నశిస్తుంది. సాయి స్పష్టంగా చెప్పిన సూక్తి ఎన్నిసార్లు చదివినా మన బుద్ధికి హెచ్చరిక కల్గనిస్థితికి వస్తాము.

సత్సంగసభ్యులలో ఒకరిమాట లొకరికి చెప్పి తంపులు పెట్టాలని ఎన్నడూ చూడరాదు. సత్సంగాలలో వర్గాలు, ముఠాలు లేవదీయకూడదు. సాటివారు ఏర్పాటు చేస్తున్న సత్కార్యాలను యథాశక్తి విచ్ఛిన్నం చేయాలని ఎన్నడూ ప్రయత్నించగూడదు. వీటిని సమర్థించుకోడానికి — అంటే మనలో లోపాలను కప్పి పుచ్చుకోడానికి వారిలో లోపాలు ఎన్ని ప్రచారం చేయకూడదు. ఇలా చేసినందువలన మనకు సిరిసంపదలు, పుణ్యమూ, గొప్పపదవులూ వచ్చినా అర్థముంది. వీటివలన మన పుణ్యనాశము, సాటివారికి అశాంతి తప్ప మరేమీ రాదు. నిష్కారణంగా అంత చెడుకు పాల్పడగలగాలంటే మనలో ఎంత దౌష్ట్యముండాలి?

ఇలాంటి ప్రమాదం నుండి

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

# సాయిబాబా

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

సంపుటి:40 అగస్టు-2022 సంచిక:04

పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిచే స్థాపించబడిన ఏకైక పత్రిక, మన 'సాయిబాబా'

## విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 01. | సత్సంగాలెందుకు? | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 03 |
| 02. | పరిప్రశ్న | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 06 |
| 03. | "లేదురా ఇటువంటి భూదేవి ఎందు" "లేరురా మనవంటి పొరులింకెందు!!" | పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ | 07 |
| 04. | మహాయోగి శ్రీ ప్రతాపకోటయ్య శాస్త్రిగారు | శ్రీమతి శ్రీదేవి | 12 |
| 05. | మాతృదేవి స్మృతులు | శ్రీమతి ఆలపాటి మోహన సుప్రియ | 14 |
| 06. | వార్తాలాపము | శ్రీమతి అడిదం వేదవతి | 16 |
| 07. | మార్గదర్శి | శ్రీ సూర్యప్రకాష్ | 18 |
| 08. | రాధాకృష్ణ ఆయీ | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 22 |
| 09. | ద్వారకామాయి అనుభవమండపము | శ్రీమతి పద్మజా రెడ్డి | 25 |
| 10. | ఆచార్యుని అద్భుత లీలలు | శ్రీమతి సరోజిని | 27 |


చిరునామా
Sri Manga Bharadwaja Trust,
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 500068
Phone No. +91 - 74160 41550
**www.saibharadwaja.org**
**www.saimasterforums.org**

చీఫ్ ఎడిటర్: డా॥ ఆర్.ఎస్. శశిధర్, పిహెచ్. డి

చందా వివరములు

| | | |
|---|---|---|
| విడి ప్రతి | : | రూ. 10-00 |
| సంవత్సర చందా | : | రూ. 100-00 |


సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.




తప్పుకోవాలంటే సత్సంగము, సేవా మినహా సాటి సత్సంగ సభ్యులతో వేరు కాలక్షేపం పెట్టుకోకూడదు. మిగిలిన సమయమంతా మనకో లేక సాటివారికో శ్రేయస్కరమైన కార్యక్రమంలో తీరిక లేకుండా నిమగ్నమవ్వాలి. బుద్ధుడు చెప్పాడు – యిప్పటికే అపారమైన దుఃఖము పాపాలతో కలుషితమైన ఈ సృష్టిని మనసా కర్మణా వాచా కలుషితం చేయకుండా చూచుకోవడం సాధకుని ప్రథమ కర్తవ్యం. సత్సంకల్పము, సద్వాక్యము, సత్కర్మలతో యథాశక్తి శాంతి, శ్రేయస్సు కల్గేలా చూడాలి.

ఇటు మానవత్వానికి, అటు ఆధ్యాత్మికానికీ గూడా శౌచం ప్రధానమని అన్ని మతాలూ చెప్పాయి. అయితే స్నానము మొదలగునవి బాహ్య శౌచానికంటే అంతరంగికమైన మనశ్శుద్ధి ఎక్కువ ప్రశస్థమని గూడా చెప్పారు. సత్సంగం మానసిక స్నానం వంటిది. దానినే కలుషితం చేసుకోడం మనం తినే అన్నంలోనూ, పీల్చేగాలిలోనూ, ఆరోగ్యం కోసం సేవించే మందులోను విషం కలుపుకొనడం లాంటిది. అప్పుడు చేసే చరిత్ర శ్రవణం వలన అందరూ సాయి రూపాలన్న సత్యం గుర్తుకు వచ్చి మనలో పాత అలవాటు వలన తలెత్తిన దౌష్ట్యాన్ని నశింపజేసుకోవాలి. దానిని నిష్పాక్షికంగా గుర్తించి, హృదయపూర్వకంగా పరితాపం చెంది, నైతికంగా అంతదుస్థితిలో వున్న మనను వుద్ధరించి అట్టి బలహీనత నుండి కాపాడమని ప్రార్థించాలి. దానికి సాధనమే సత్సంగం యొక్క లక్ష్యం.

అందుకే సత్సంగంలో చరిత్ర శ్రవణం చేస్తున్నంతసేపూ భక్తులకు సాయి యిచ్చిన అనుభవాలు యీ సూక్తుల నెంతగా ధ్రువపరుస్తున్నాయో గుర్తిస్తూ సాటి సత్సంగ సభ్యులపట్ల మన వైఖరి, ప్రవర్తనను చక్కదిద్దుకోవాలి. ఇలా సుమారొక 40 ని॥లు శ్రవణం చేశాక, భజన చేస్తున్న అరగంటసేపూ దాని అర్థాన్ని భజనచేస్తూ యీ సత్యాలనే మననం చేసుకోవాలి. ఈ సత్యాన్ని మరుగుపరిచే భేదబుద్ధిని అలా తొలగించుకొని భజనయ్యాక కనీసం 10 ని॥లు ఆ భావాన్నే ధ్యానించి తరువాత వ్యర్థప్రసంగమేమీ చేయకుండా ఇళ్ళకు వెళ్ళిపోవాలి. నచ్చకుంటే ఆత్మీయతతో చెప్పి చూడాలి. ఆ పైన ఆ విషయం మరచి మనం లక్ష్యంగా పెట్టుకున్న సద్భావంతోనే నిలవాలి. అది వీలుగాకున్నప్పుడు మనం మౌనంగా తొలగి మనకు వుత్తమమని తోచినరీతిన సత్కార్యం చేయాలి. ఇలాంటి జాగ్రత్తలు తీసుకొన్న వారే ఆధ్యాత్మికంగా పురోగమిస్తారు. మిగిలిన వారు పురోగమించరు, సరిగదా సాటివారి మనసులను కలుషితం చేసి, వారి పురోగతికి అంతరాయం చేసిన దోషం మూటగట్టుకొంటాం. కుటిలతతో మిత్రుల మధ్య, దంపతుల మధ్య బేధం కల్పిస్తేనే మహాపాపమన్నాయి శాస్త్రాలు. అంతకంటే ఎన్నోరెట్లు పవిత్రమైన యీ గురు బాంధవ్యాన్నే కలుషితం చేస్తే ఫలితం చెప్పనవసరం లేదు. అందరికీ నీరిచ్చే చెరువులను, పశువులెన్నింటికో ఆహారమైన గడ్డినీ కూడ మలినపరచడం పాపమని ధర్మశాస్త్రం చెబుతున్నది. సర్వజీవులకూ శ్రేయస్సు నివ్వగల సత్సంగాలను కలుషితం చేయగలగాలంటే సాక్షాత్తూ కలిపురుషుడికున్నంత గుండె ధైర్యంగావాలి. కలి గూడ సద్గురు భక్తులను చూస్తేనే తనకు భయం కలుగుతుందని బ్రహ్మదేవునితో చెప్పాడు. ఇటువంటి జాగ్రత్తలు తీసుకున్నప్పుడే సత్సంగాలు సార్థకాలౌతాయి. •

# పరిప్రశ్న

**పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ**

## ప్రశ్న:- వేదవిద్య వలన దేశానికి గల ప్రయోజనమేమి?

**- రామచంద్రరావు, కపిలేశ్వరపురం**

**జవాబు :-** నేటి విజ్ఞాన, సాంకేతిక శాస్త్రాలను వినియోగించుకోగలగాలంటే తగిన విద్యా విధానమవసరము. అందులో అట్టి సిద్ధాంతము (థియరీ) ఇట్టి ప్రయోగము కూడా (ప్రాక్టికల్) అవసరం. ఈ రెండు అర్థం కావాలంటే గణిత శాస్త్రము, భౌతిక రసాయనిక శాస్త్రాలు, తర్కము (లాజిక్) మొ॥న వెన్నో తెలియాలి.

అలానే వేదవిద్య వుపయోగపడాలంటే సిద్ధాంతము కావాలి. దానిద్వారా ఈ సృష్టితత్వము, మానవుని శారీరక, మానసిక తత్వాలను తెలుసుకోవచ్చు. అవి తెలిశాక ఈ రెంటినీ సమన్వయించుకొన్న కొన్ని ప్రయోగాల వలన మన చేతనాన్ని వికసింపజేసుకోవచ్చు. అప్పుడు మానవుడు మిగిలిన ప్రకృతితో సామరస్యంగా జీవించగల సహజ నైపుణ్యం గలవాడవుతాడు. అపుడు జాతి మనుగడకు అవసరమైన ప్రకృతి వనరులను సంరక్షించుకోగలుతాడు. వాటిని అటు ప్రకృతికి యిటు తన జాతికి వినాశకరంగాని రీతిన వి ని యో గిం చు కో గ ల్గు తా డు . అందుకవసరమైన దివ్యమైన ప్రేమ ప్రకృతిలోని వస్తువుల, ప్రాణులపట్ల వహించడం చేత అతని జీవితం గూడ ప్రేమమయమవుతుంది. తృప్తి మానవజీవిత లక్షణమవుతుంది. అప్పుడు స్వార్థము, అసూయ, ద్వేషము పలుచబడతాయి. అశాంతి తొలుగుతుంది. ఆధునిక విజ్ఞానము, సాంకేతిక విద్య బాహ్యమైన జీవితాన్ని, ప్రకృతిని సంస్కరించుకొనే వుపాయాలవుతే వేదవిద్య మానవుని ఆంతరంగిక ప్రకృతిని సంస్కరించుకొనే ఉపాయం. మొదటి రెండూ మానవుడు తన పరిసరాలను మార్చుకొనే పద్ధతి; రెండవది వాటిని దూరదృష్టితో సద్వినియోగం చేసుకొని వినోదకరమైన పంథా తొక్కకుండా చూచుకునే పద్ధతి. అయితే మొదటిరకమైన విద్య కెంత ప్రత్యేకమైన తర్ఫీదవసరమో రెండవదానికీ అంతే అవసరం. ప్రాచీనకాలంలో మొదటిదానిని అశ్రద్ధ చేసి రెండవదానికి మాత్రమే ప్రాముఖ్యమివ్వడం పొరపాటు. ఈనాడు అందుకు విపర్యమైన పొరపాటు జరుగుతోంది. ప్రకృతి తల్లి, మానవుడు బిడ్డడు అనుకుందాము. కేవలం బాహ్యవిద్యకే ప్రాముఖ్యమిచ్చే మానవుడు తల్లిని ప్రేమించక ఆమె ప్రేమను పచ్చి స్వార్థంతో హృదయం లేకుండా వాడుకొనేవాడవుతాడు. తల్లిచాటునుండి అన్నీ పొందినా ఆమె ప్రేమ నర్థం చేసుకొని ఆనందించే అదృష్టంలేని దౌర్భాగ్యుడవుతాడు. వేదవిద్య గూడ నేర్చుకొనేవాడు తల్లినుండి సర్వాన్నీ పొందుతూ ఆమె ప్రేమనర్థం చేసుకొని ఆనందిస్తూ, ఆమెను తిరిగి ప్రేమిస్తూ తన శ్రేయస్సు ఆమె శ్రేయస్సు కోరినటువంటివాడు. అటువంటివాడికి తక్కిన ప్రకృతి పట్ల గూడ అదే భావముంటుంది. అందుకే కేవల బాహ్యవిద్యకు ప్రాముఖ్యమిచ్చే యీ రోజులలో ఒకరినొకరు హృదయరహితంగా వాడుకొనడం చూస్తున్నాము. అలాగాక వెనుకటి కాలంలో చెట్లను, జంతువులను గూడ

*మిగతా 29వ పేజీలో*

*(ఆగస్టు 2011 సాయిబాబా మాసపత్రిక నుండి)*

# "లేదురా ఇటువంటి భూదేవి ఎందు"
# "లేరురా మనవంటి పౌరులింకెందు॥"

***పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ***

'మాతృదేవో భవ, పితృ దేవో భవ, ఆచార్యదేవో భవ' అని పెద్దల వాక్యం. ఇందులో ప్రథమ స్థానం వారు మాతృదేవికే యిచ్చారు. కారణం మనకు తెలిసినదే. మనం జన్మించడానికి తల్లిదండ్రులిరువురూ కారణభూతులే అయినప్పటికీ ఆ బీజాన్ని తన గర్భంలో యిముడ్చుకుని పరిపూర్ణ శరీరం గల జీవిగా పపంచంలోకి తీసుకువచ్చేది మాత్రం మాతృమూర్తియే. ఆ మాతృదేవత యొక్క గర్భపరిస్థితి, శారీరక పరిస్థితి, మానసిక పరిస్థితి సరిగా లేకపోయినట్లయితే సరియైన జీవునిగా, అంటే మానసిక, శారీరక వ్యవస్థ సరిగా పనిచేసే విధంగా, మనం జన్మించలేము. కనుక అట్టి మాతృమూర్తిదే ప్రథమ స్థానం అని గుర్తించక తప్పదు.

ఈ విశాల విశ్వంలో అనేక గ్రహగోళాలు సంచరిస్తూ వుంటాయి. కానీ ఈ భూగోళం మీద మాత్రమే అనేకరకాలైన జీవరాశి ఉత్పన్నం కావడానికి అనుకూల పరిస్థితి ఏర్పడి వున్నది. ఈ భూగోళం మీద వివిధ రకాలైన జీవరాశులు వున్నప్పటికీ, భారతవర్షంలోని భారత ఖండంలో వున్నటువంటి జీవరాశి ప్రత్యేక స్థానాన్ని ఆక్రమిస్తుంది. ఇందులో వున్న వృక్ష సంపదగాని, జంతుజాలంగానీ, జలవనరులుగానీ మరెక్కడా అంతగా కనిపించవు. మూడు వైపులా మహా సముద్రము, ఉత్తరాన తనకెవరూ సాటిలేరన్న ధీమాతో నిలబడివున్న ఎత్తైన హిమవత్పర్వత శ్రేణి, హిమాలయాలనుంచి కిందకు జాలువారుతున్న అనేక ఔషధులతో కూడిన పవిత్ర గంగానది; గోదావరి, కృష్ణ, కావేరీ, నర్మద, తపతీ మొదలైన మహానదీ నదములు, వాటి ఉపనదులు, ఎన్నో జలపాతములు, సెలయేరులు, నీటి బుగ్గలు – ఈ పవిత్ర భూమిలో ఎన్నో! వాటితో సస్యశ్యామలంగా వృద్ధి చెందే వృక్షజాలముతోనూ, పైరు పంటలతోనూ నిత్యనూతనంగాను, అత్యంత రమణీయంగానూ విలసిల్లే ఈ భరతమాత సౌందర్యాన్ని వర్ణించనెవరితరము? ఇవన్నీ ఎప్పుడైతే వున్నాయో ఇక యిక్కడ జీవరాశికి కొదవ ఏముంటుంది? అనేక రకాలైన, చిత్ర విచిత్రములైన జీవరాశులలో ఈమె అనంత సంతతిగల మాతృమూర్తి. ఈమె ఎప్పుడూ నిండు చూలాలు, నిత్య బాలింతరాలు గూడ.

అంతేగాదు, వజ్రవైఢూర్యాలు, మరకత మాణిక్యాలు మొదలగు అపార ఖనిజసంపదను తన గర్భంలో నింపుకుని ప్రభవిల్లే రత్నగర్భ భరతభూమి. ఇవన్నీ ఒక ఎత్తైతే ఈ పవిత్ర భూమి యందుద్భవించిన మానవజాతి విశిష్టత చెప్పనలవిగాదు. భూగర్భ, ఖగోళ శాస్త్రములు, భౌతిక, రసాయనిక శాస్త్రములు, జీవ, జంతు, వృక్ష శాస్త్రములు మొదలైన అనేకానేక శాస్త్రములందు ఆరితేరిన శాస్త్రజ్ఞులు – వైద్య విజ్ఞానానికి మూలపురుషుడైన ధన్వంతరి నుంచి సిద్ధ నాగార్జునుడు మొదలైన ఎందరో ఎన్నో రకాల వైద్యములను, ఔషధులను కనిపెట్టిన భిషగ్వరులు – మంత్ర, తంత్రములను తెలిపిన మహాయోగులు, మంత్రోచ్చారణతోను, మాట

మాత్రం చేతనూ ఏదైనా చేయగల మహాతపస్వులు, మహర్షులు – విశ్వసృష్టిక్రమము, దాని పుట్టుక, సకల గ్రహగోళముల పుట్టుక, అవి సంచరించు విధానము, సృష్టి యొక్క ఆది, అంతములు, అవి ఎప్పుడు ఏ విధంగా ఉద్భవించి, ఎంతకాలము వసించి, ఎప్పుడు లయిస్తాయో తెలిపే కాలనిర్ణయము మొదలైన విషయముల గూర్చిన సరియైన అవగాహన కలిగిన భూత, భవిష్యద్రష్టలైన శాస్త్రజ్ఞులు – ఏయే లోకాలు ఎక్కడెక్కడ వున్నాయో, వాటి కధిపతులెవరో, అవి ఎలా వుంటాయో వాటి లక్షణాలేమిటో తెలుసుకున్న తత్వవేత్తలు – యిక్కడే ఉద్భవించారు.

అంతేగాక ఈ సృష్టి యొక్క తత్త్వమును గూర్చి – ఈ సృష్టి ప్రణవ స్వరూపమని, సంగీతమయమని, శబ్దస్వరూపమని, నాట్యమయమని, లయ, తాళ బద్ధమని అనుభవపూర్వకంగా నిరూపించిన శాస్త్రజ్ఞులు, వివిధ కళల పుట్టుక నెరిగి, వాటి అర్థాన్ని, ప్రయోజనాన్ని పరిశోధించి వాటి యందు ఆరితేరిన కళాకోవిదులు జన్మించినదిక్కడే.

సృష్టిలోని ప్రతి చిన్న విషయం దగ్గరనుంచి పెద్ద దాని వరకూ ఇక్కడివారు స్పృశించని భాగంలేదు, వారికి తెలియని విషయం లేదు. అంతేగాక ఈ సృష్టియొక్క రహస్యాన్ని తరచి తరచి ఆలోచించి, ధ్యానించి అనుభవపూర్వకంగా తెలుసుకున్న వేదవిదులు, తత్త్వవేత్తలు ఈ సృష్టిలో జన్మించిన ప్రతి ప్రాణీ – చేతనములే గాక జడములతో సహా – ఏ కారణంగా సృష్టింపబడ్డాయో, వాటి జన్మ రహస్య మేమిటో, కర్మలను ఏ విధంగా మలచుకుంటే సుఖశాంతులతో జీవించవచ్చో, ఏవిధమైన కర్మలు చేస్తే ఎటువంటి ఫలితాలు కలుగుతాయో తెలియజెప్పారు.

జన్మించిన ప్రతి జీవి తాను చేసిన కర్మల ఫలితంగా తిరిగి తిరిగి జన్మల నెత్తవలసి వుంటుందని జన్మ నెత్తిన ప్రతిసారి కష్టసుఖాలను తప్పక అనుభవించవలసి వుంటుందనీ కనుక ఈ జన్మ పరంపరల నుండి బయటపడే మార్గాన్ని అనుసరింపక తప్పదనీ గూడ తత్త్వవేత్తలు సూచించారు. అందుకని ఈ సృష్టికి మూలమైన దానిని చేరుకోడానికి అంటే జన్మ పరంపరలనుండి విముక్తి చెందడానికి చేయవలసిన అనేక యోగ సాధనలను వారు ప్రవచించారు.

ఈ సృష్టిలోని జీవులు ధర్మభ్రష్టులై అశాంతితో అలమటించి పోతున్నప్పుడు ఆయాదేశ కాల పరిస్థితులననుసరించి అవతార పురుషులు అవతరించి మళ్ళీ ప్రజలను ధర్మమార్గాన నడిపించి శాంతిని నెలకొల్పుతూ వస్తున్నారు. వీరే గాక, అట్టి శాంతిని పొందడం వల్ల కలిగే లాభమేమిటో తెలియజెప్పి, ప్రజలను సన్మార్గవర్తనులుగ జేసి సుఖశాంతులను పొందే యత్నం చేయడానికి వారిని అందుకు ఉన్ముఖులను చేసేటందుకు అనేకమంది మహాత్ములు ఎల్లప్పుడూ ఈ భరత భూమిపై వుంటూనే వున్నారు.

ఏ కోణంలో నుంచి చూసినా ఇంతటి ఉన్నతమైన, అద్భుతమైన, విశిష్టమైన భూమి ఎక్కడా కన్పించదు. ఇంతటి విశిష్టత కలిగిన ఈ భరతభూమిపై మనం జన్మించడం నిజంగా ఎంతటి అదృష్టం! అయితే ఇంతటి అదృష్టం కలిగిన మనం ఈనాడు ఎలా జీవిస్తున్నాము? ఈ విశిష్టతను అర్థం చేసుకుని మనకు జన్మనిచ్చిన ఈ భరత మాత పట్ల ప్రేమ, భక్తి, వినమ్రతతో, మెలగుతున్నామా? అన్నది ఆలోచించాల్సిన విషయం.

సహనానికీ, త్యాగానికి ప్రతీకగా ఈ భూదేవిని చెబుతారు పెద్దలు. తనను పూజించినవారినీ, దున్నిన వారినీ, తన్నిన వారిని గూడ ఏమీ అనక మౌనంగా భరిస్తుంది. ఈ భూమాత. నిలబడడానికి ఆధారమైన ఈ భూమాతను నిలువుగా చీల్చడానికి ప్రయత్నిస్తాము. ఆమె నుండి అవసరమైన వాటినే గాక, అనవసరమైన వాటిని గూడ పిండుకోజూస్తాము. ఆమెపై మల మూత్ర విసర్జనలు గూడ చేస్తాము. చిట్ట చివరకు ఆమె ఒడిలోనే శాశ్వత నిద్ర పొంది ఆమెలోనే కలిసిపోతాము. ఇది ఎప్పుడైనా మనం ఆలోచిస్తామా? – అంటే లేదనే చెప్పవచ్చు.

అందుకని ఆమె యొక్క గొప్పతనాన్ని గుర్తిస్తూ ఆమె ప్రసవించిన అద్భుత సృష్టిని అర్థం చేసుకుంటూ ఆమె పట్ల భక్తి గౌరవాలతో, కృతజ్ఞతతో మెలగడం మన ప్రధాన కర్తవ్యం.

అయితే ఈ కర్తవ్యాన్ని మనకు బోధించగలవారెవరు? పైన చెప్పుకున్నట్లు ఎలా మనం మన భావనలను అనుక్షణమూ నిలుపుకోవాలో, దాని వలన మనం ఎలా సుఖశాంతులతో జీవించగలుగుతామో చెప్పి, మనకు సరియైన మార్గాన్ని చూపించడమేగాక, ఆ మార్గాన నడిపించగల మహనీయులు ఎందరో వున్నారు. అలా నడిపించగల మహాత్ములను దర్శించి, సేవించి వారి నుండి

జీవించడమెలాగో నేర్చుకోవాలి.

మన అదృష్టం కొద్దీ మనకు సరియైన మార్గం తెలిపి అన్ని విధాలా మనలను ఉద్ధరించగల పూజ్యశ్రీ మాస్టరుగారు లభించారు. ఆయన సమర్థ సద్గురు సాయినాథుని సేవించి వారిననుసరించి జీవించి తరించిన మహాత్ములు. మన జీవన విధానం గూర్చి పూజ్యశ్రీ మాస్టరుగారు ఎన్నో విషయాలు చెప్పారు. అలాగే మనం ఇంతకు ముందు చెప్పుకున్నట్లు ఈ భారతదేశం గురించి గూడ ఎంతగానో చెప్పడం జరిగింది.

ఈ భరత భూమిలోని అపార సంపదను, అద్భుత జ్ఞాన సంపదను చూసి ఆశ్చర్యచకితులైన ఆంగ్లేయులు దానిని తాము ఎలాగైనా పొందాలనే ఆకాంక్షతో, కుతంత్రాలతో ఈ పవిత్రభూమిని రెండు వందల సంవత్సరాలపాటు పాలించి మన సంపదను కొల్లగొట్టుకుపోవడమే గాక, మన సంస్కృతిని గూడ ఛిన్నాభిన్నం చేసారు. మన దేశ మహోన్నత చరిత్రను తిరగరాయించారు. మన అలవాట్లను పూర్తిగా మార్చివేశారు. అన్ని విధాలా మనలను భ్రష్టు పట్టించారు.

అయితే మన సంస్కృతి ఎన్ని విధాల భ్రష్టు పట్టినప్పటికీ దానిని సరిగా నిలబెట్టడానికి మహాత్ములు ఈ గడ్డపై అవతరిస్తూనే వున్నారు. సాధ్యమైనంతవరకూ నిలబెట్టడానికి ప్రయత్నిస్తూనే వున్నారు. అందుకే ఇప్పటికీ విదేశీయులు మన సంస్కృతికీ, ఆధ్యాత్మికతకూ బహ్మారథం పడుతూ, దానిని ఆచరించడానికి ప్రయత్నిస్తున్నారు. కానీ మన దురదృష్టం కాబోలు మనం వారి కుసంస్కృతిని నేటికీ, అంటే మనలను వారు విడిచిపెట్టి వెళ్ళిన ఇన్ని సంవత్సరాల తర్వాత గూడ అనుసరిస్తూనే వున్నాము.

ఆంగ్లేయుల పాలనలో మనం మన సంస్కృతిని పూర్తిగా విస్మరించాము. 'పొరుగింటి పుల్లకూర రుచి' అన్నట్లుంది మన పరిస్థితి. దేశభక్తి పరంగా చూసినా మన దేశ స్వాతంత్రం కోసం పాణాలర్పించిన వారిని సైతం మనం విస్మరించాము. ఇతర దేశాలలో స్మరణీయదినాలను పెట్టుకుని ఇటువంటి వారిని స్మరించుకుంటారు.

కానీ మనమూ! కనీసం స్వతంత్ర దినోత్సవము, గణతంత్ర దినోత్సవములలోనైనా అట్టి త్యాగధనులను స్మరించుకుంటున్నామా! అన్నది సందేహమే. కేవలం జెండాలు మాత్రం ఎగరేసి తృప్తి పడుతున్నాము.

ఉదాహరణకు విదేశాలకు వెళ్ళిన మనవాళ్ళ పిల్లలకు చాలామందికి మాతృభాష రాదు. ఆంగ్ల భాష మాత్రమే వచ్చు. కారణం మనం ఇంట్లో గూడ మన మాతృభాషను మాట్లాడుకోము గనుక. ఇతర దేశాల వరకూ ఎందుకు? ఇతర రాష్ట్రాలకు వెళ్ళిన చాలామంది పిల్లలకు తెలుగు మాట్లాడడం గూడ రాదు. అంటే మనలో కొందరము ఇంట్లో 'తెలుగు' అన్న పదాన్ని ఆంగ్లంలో గూడ రానివ్వమన్నమాట. కారణం తెలుగు అన్నది తెలిస్తే మన పిల్లలు తెలుగు ఎక్కడ నేర్చుకుంటారోననే భయం. అంటే మన భావం ఏమిటన్నమాట? మన తల్లిని మనం కించపరచుకుంటున్నా మన్నమాట. మాతృభాషనే గౌరవించని మనం మాతృదేశాన్ని గౌరవించగలమా? గౌరవించడమనేది అలవాటు చేయకపోతే మన పిల్లలు మనలను ఎలా గౌరవిస్తారు? అందుకనే ఈ రోజులలో చాలా మంది పిల్లలు "తల్లిదండ్రులను ఎందుకు గౌరవించాలి?" అని అడుగుతున్నారు. "మీరేమన్నా మమ్మల్ని కావాలని కన్నారా? మేమే పుట్టాము. మీకు – కాకపోతే మరొకచోట పుట్టి వుండేవాళ్ళమేమో!" అంటున్నారు. అలాగే "ఈ దేశంలో కాకపోతే మరొక దేశంలో పుడతాము. ఇందులో గౌరవించడానికి ఏమున్నది? ఇంకా యిక్కడైతే కట్టుబాట్ల కబంధహస్తాలలో ఇరుక్కుంటాము. ఇతర దేశాలలో అవి లేవు కనుక స్వేచ్ఛగా వుండవచ్చు" అంటున్నారు. అలా అని అన్ని విషయాలలోనూ వాళ్ళను అనుసరిస్తామా అంటే అదీ కన్పించడం లేదు. వాళ్ళు మన దేశంలో అన్ని వందల సంవత్సరాలు వున్నప్పటికీ వాళ్ళ వేషభాషలు మార్చుకున్నారా? వాళ్ళ భాషనే వాళ్ళు మాట్లాడారు గదా! వాళ్ళ వేషమే వాళ్ళు వేసుకున్నారు గదా!

కానీ మనదేశంలో వుండే మనము ఇప్పటికీ వాళ్ళ వేషభాషలనే అనుసరిస్తున్నాము. వాళ్ళ సాంప్రదాయాలను వాళ్ళు వదులుకోనప్పుడు మన సాంపదాయాన్ని మనమూ వదులుకోగూడదదన్న విషయాన్ని మాత్రం మనం వాళ్ళ నుండి నేర్చుకోవడం లేదు.

ఇట్టి దుస్థితి గూర్చి పూజ్యశ్రీ మాస్టరుగారు ఎంతగానో ఆవేదన చెందేవారు. ఈ పరిస్థితి బాగుపరచాలని ఆయన ఎంతగానో ఆలోచించి దీనికి పరిష్కార మార్గం ధర్మప్రబోధమేనని తలచారు. ధర్మబుద్ధిని విస్మరించిన తెల్లవారి నిరంకుశ పాలనను నిర్మూలించడానికి తన

జీవితాన్నే ధారపోసిన గాంధీ మహాత్ముడినే గాక, అందుకై పోరాడిన కిందటి తరం వారిని విస్మరించారు. ఆనాడు ఎన్నో కోట్ల మంది తమ జీవితాలను స్వరాజ్య పోరాటానికి అంకితం చేసి కుటుంబాలను, పదవులను, సంపదలను త్యాగం చేసి చెరసాళ్ళలో మగ్గి అష్టకష్టాలు పడ్డారు. ఎంతోమంది ఆ పోరాటంలో మరణించారు గూడ. కానీ నేడు మనలో చాలామందికి అట్టి త్యాగమూర్తుల గూర్చిగాని, ఆ ఉద్యమానికి మూలపురుషుడైన గాంధీ మహాత్ముని గూర్చిగానీ తెలియకపోవడమే చిత్రం. దీనికి మూలకారణం ధర్మాన్ని విస్మరించడమే కారణమని పూజ్యశ్రీ మాస్టరుగారు భావించారు. అందుకనే ఆనాడు ఐకమత్యంతో పోరాడి తెల్లవారిని మన దేశం నుంచి వెళ్ళగొట్టినప్పటికీ నేటి ప్రజలు ఐకమత్యం లేక అనేక భేదభావాలతో, తగవులు కొనితెచ్చుకుంటున్నారు. నేడు ఎక్కడ చూసినా విభేదాలే, తగువులాటలే!

అందుకనే పూజ్యశ్రీ మాస్టరుగారు ధర్మప్రబోధాన్ని ప్రథమ కర్తవ్యంగా భావించారు. అయితే నేడు ధర్మం గూర్చి చెబితే వినేవారెవరు? కనుక అట్టి ధర్మబద్ధ జీవనం గడిపే మహాత్ముల పట్ల భక్తి భావం కలిగితే ఆ మహాత్ములు చెప్పేది నెమ్మదిగా ప్రజల మనసులలోకి ఎక్కుతుందని, క్రమంగా వారు ధర్మబద్ధ జీవితాన్ని గడపగలరనీ ఆయన భావించారు. కనుక మహాత్ముల సేవనం ముఖ్యమని ఆయన తలచారు. వారిలో గూడ కోహినూర్ వజ్రం వంటి వారయిన శిరిడీ సాయినాథుని సేవించడం అత్యంత ప్రధానమని ఆయన తలచారు.

ఆయన శిరిడీ సాయినాథుని గూర్చి ప్రచారం చేసినప్పటికీ అప్పుడప్పుడు ఆయన భారతీయ సంస్కృతి గురించి, దాని వైభవం గురించి, ఈ దేశ చరిత్ర గురించి చెబుతూ వుండేవారు. ప్రస్తుత పరిస్థితిలో మన సంస్కృతిని కాపాడుకోవలసిన అవసరం ఎంతైనా వుందని ఆయన బోధించేవారు. ఆయన రచించిన 'శ్రీ సాయి సన్నిధి' లో గూడ శ్రీ శిరిడీ సాయిబాబా స్వతంత్రోద్యమంలో సూత్రధారియై పావులు ఎలా కదిపారో స్పష్టంగా వ్రాశారు గూడ.

భౌతిక శాస్త్ర విజ్ఞానము, ఆధ్యాత్మిక జ్ఞానము రెండూ ఇక్కడ సంపూర్ణంగా వున్నాయని, లౌకిక జీవితం ద్వారా ఆధ్యాత్మికతను సాధించగల విశిష్ట జీవన విధానం ఇక్కడ



వున్నదని ఆయన చెప్పేవారు. సర్వ సమైక్యతే భారతీయ తత్త్వమని, వివిధ జాతులను, మతాలను, కులాలను సమానంగా చూడడము, అందరితో కలిసి జీవించడమేనని ఆయన చెప్పేవారు. కనుక దేశకాల పరిస్థితుల ననుసరించి వివిధ మతాలు ఏర్పడినప్పటికీ ఆ మతాలకు మూల పురుషులు చెప్పిన సత్యమొక్కటేననీ కనుక మానవులందరూ కలిసి జీవించగలగడమే సరియైన జీవిత విధానమనీ ఆయన బోధించేవారు.

ఆయన సత్సంకల్పానికి మెచ్చి కాబోలు ఒక రోజు బాబా పూజ్యశ్రీ మాస్టరుగారికి స్వప్నం ద్వారా స్వాతంత్య్ర పోరాటం గూర్చి, సమైక్య జీవన విధానాన్ని గూర్చి గ్రంథాలు రచించమని సందేశమిచ్చారు. అది బాబా యొక్క ఆజ్ఞగా భావించి పూజ్యశ్రీ మాస్టరుగారు అట్టి రచనకు పూనుకున్నారు.

అందుకని మనం ఆయన చెప్పినట్లు సర్వమానవ సమైక్యత కోసం ప్రయత్నిస్తూ, ఆయన చెప్పిన మార్గంలో నడుస్తూ ఆయన మరల అవతరించాలనీ, ఆయనే గాక

ధర్మస్థాపన చేసే మహాత్ములు అవతరిస్తూనే వుండాలనీ మనసారా ప్రార్థిద్దాము. పూజ్యశ్రీ మాస్టరుగారు యిలా చెప్పేవారు: "జన్మనిచ్చిన తల్లియొక్క, జన్మభూమి యొక్క ఋణాన్ని మనం ఏనాటికీ తీర్చుకోలేము. అందుకని మనలనుసర్వకాలసర్వావస్థలయందుభరించేజన్మభూమికి మనము అనుక్షణమూ కృతజ్ఞులమై వుండాలి. ఆమెను జాగత్తగా కాపాడుకుంటూ వుండడం మన కనీస కర్తవ్యం. అందువలన మనమే సుఖంగా జీవించగలుగుతాము. అలాగాక రక్తపాతం చేసుకుంటే తాను యింతటి భ్రష్టులను కన్నానా?" అని ఆమె కంపిస్తుంది. పకృతి విలయతాండవం చేస్తుంది. పర్యవసానం అనుభవించక తప్పదు" అని.

అందుకని మనం పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పినట్లు ఈ దేశము, ఈ జాతి ఎంత ఉన్నతమైనదో గుర్తుపెట్టుకోవాలి. ఇక్కడ జన్మించినందుకు మనమెంతటి అదృష్టవంతులమో తెలుసుకోవాలి. మనకు జన్మనిచ్చినందుకు జననియైన జన్మభూమికి అనుక్షణము కృతజ్ఞతలు తెలుపుకోవాలి.

అందుకే అన్నారు పెద్దలు : "జననీ జన్మభూమిశ్చ, స్వర్గాదపి గరీయసీ" అని. "జన్మనిచ్చిన తల్లి, జన్మభూమి స్వర్గానికంటె గొప్పవి!"

ఈ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా మన భారతమాత విముక్తి కోసం ఎంతగానో కృషి చేసిన, అసువులు బాసిన త్యాగమూర్తులకు మరొక్కసారి కృతజ్ఞతా పూర్వక వందనాలను సమర్పిద్దాం. పూజ్యశ్రీ మాస్టరుగారి డెబ్బది అయిదవ జన్మదిన సందర్భంగా సంకల్పించిన 'కృతజ్ఞతామహోత్సవ' సందర్భంగా మనము మన దేశ, జాతి, సంస్కృతి కోసం సమైక్యంగా ధర్మ ప్రవర్తనను అలవరచుకుందాం. సాటివారికి ధర్మాన్ని ప్రబోధించడానికి దీక్ష పూనుదాం.

ఈ సందర్భంలో దేశ భక్తుడు శ్రీ రాయప్రోలు సుబ్బారావుగారు రచించిన ఈ దేశభక్తి గీతాన్ని ఒక్కసారి స్మరించుకుందాం.

*ఏ దేశమేగినా ఎందు కాలిడినా*
*ఏ పీఠమెక్కినా ఎవ్వరేమనినా*
*పొగడరా నీ తల్లి భూమి భారతిని*
*నిలపరా నీ జాతి నిండు గౌరవము*

*ఏ పూర్వ పుణ్యమో, ఏ యోగ బలమో*
*జనియించినాడ వీ స్వర్గఖండమున*
*ఏ మంచిపూవులన్ ప్రేమించినావో*
*నిను మోసె ఈ తల్లి కనక గర్భమున*

*లేదురా ఇటువంటి భూదేవి యెందూ*
*లేరురా మనవంటి పౌరులింకెందు.*
*సూర్యునీ వెలుతురుల్ సోకునందాక*
*ఓడల జండాలు ఆడునందాక*

*అందాక గల ఈ అనంత భూతలిని*
*మన భూమి వంటి చల్లని తల్లి లేదు*
*పాడరా నీ తెల్గు బాలగీతములు*
*పాడరా నీ వీర భావ భారతము*

*తమ తపస్సులు ఋషుల్ ధారవోయంగా*
*శౌర్య హారముల్ రాజచంద్రులర్పింప*
*భావ సూత్రము కవి ప్రభువులల్లంగ*
*రాగ దుగ్ధముల్ భక్తరత్నముల్ పిదుక*

*దిక్కులకెగదన్ను తేజమ్ము వెలగ*
*రాళ్ళ తేనియలూరు రాగాలు సాగ*
*జగములనూగించు మగతనంబెగయ*
*సౌందర్యమెగ బోయు సాహిత్యమలర*

*వెలిగినదీ దివ్య విశ్వంబుపుత్ర*
*దీవించె నీ దివ్య దేశంబు పుత్ర*
*పొలములా రత్నాలు మొలిచెరా ఇచట*
*వార్ధిలో ముత్యాలు పండెరా ఇచట*

*పృథివి దివ్యౌషధుల్ పిదికెరా మనకు*
*కానలా కస్తూరి కాచెరా మనకు*
*అవమానమేలరా? అనుమానమేలరా?*
*భారతీయుడనంచు భక్తితో పాడ!!*

(గత సంచిక తరువాయి)

# మహాయోగి శ్రీ ప్రతాపకోటయ్య శాస్త్రిగారు

శ్రీమతి శ్రీదేవి

ఆ రోజు జోగయ్యశాస్త్రి గారింట్లో పెద్ద రాద్ధాంతమే జరిగింది. మన సొమ్ము చాలక ఊరివారి సొత్తును కూడా దానం చేసే హక్కు వీడికెక్కడిది?

స్వయంకృషితో డబ్బు సంపాదించి, తన డబ్బు తన యిష్టం వచ్చినట్లు దానధర్మాలు చేసుకుంటే ఎవరికీ అభ్యంతరం వుండదు. చదువు, సంధ్యలేని వీడికి ఉద్యోగమెవరిస్తారు? డబ్బు ఎలా సంపాదిస్తాడు? పొలం పనులు అప్పగిస్తే పండిన పంటనంతా దారినపోయే వాళ్ళకు దానం చేస్తాడు. వ్యాపారంలో నయినా అంతే! మన ఘటాలు వున్నంతవరకు మనం పోషిస్తాం. ఆ తర్వాత వీడి పరిస్థితి ఏమిటి? అనుకొని వ్యధ చెందాడు ఆ తండ్రి. భర్త ఆవేదన విన్న లక్ష్మీదేవి, "తన-పర భేదం లేని నిస్వార్థపరుడు, నిశ్చయంగా మన బిడ్డ యోగపురుషుడు అని నా నమ్మకం. అతని భవిష్యత్తు ఆ భగవంతుడే చూసుకుంటాడు. దిగులు పడవద్దు" అంటూ భర్తను ఓదార్చింది. అంతకుమించి వారు చేయగలిగిందేముంది?

కాలం గడుస్తున్న కొద్దీ జోగయ్య శాస్త్రిగారికి తన కుమారుడి భవిష్యత్తుపై ఆందోళన తీవ్రం కాసాగింది.

మాయాబద్ధులై ప్రాపంచిక భావనలతో జీవించే మానవులు కోటయ్య శాస్త్రిగారిలోని దివ్యత్వాన్ని, అతని వైరాగ్యాన్ని ఎలా అర్థం చేసుకోగలరు? లోకరీతికి విరుద్ధంగా వ్యవహరిస్తున్న కన్నకొడుకు గురించి ఆందోళన చెందకుండా ఎలా వుంటారు? సంసార బంధాలు, సిరిసంపదలు - వీటికి మాత్రమే ప్రాధాన్యతనిచ్చే ప్రాపంచికులకు, లోక మంతటినీ తన కుటుంబంగా భావించి, జ్ఞాన సంపదను ఆ విశ్వకుటుంబానికి అందించి, ఉద్ధరించేందుకై అవతరించిన ఆ మహాత్ముల ప్రవర్తన లోకవిరుద్ధంగా అనిపించటంలో ఆశ్చర్యమేముంది?

అలనాటి రమణమహర్షి, శ్రీమాణిక్యప్రభు మహరాజ్ మరెందరో మహనీయుల చిన్ననాటి వైఖరి పట్ల వారి వారి కుటుంబ సభ్యులు యిలా ఆందోళన చెందటం మనం వారి జీవిత చరిత్రలలో చూస్తాము.

కొన్ని సంవత్సరాలు గడచిపోయాయి. తన కుమారుడి ప్రవర్తనలో మార్పు వస్తుందేమోనని ఎదురు చూసిన జోగయ్యశాస్త్రిగారి ఆశలు నిరాశలే అయినాయి. కుటుంబ బరువు బాధ్యతలు నెత్తిన పడితే డబ్బు విలువ దానంతట అదే తెలిసివస్తుంది. అప్పుడు సంపాదనపై తప్పనిసరిగా దృష్టి మరలుతుందని ఆలోచించి తన కుమారుడికి వివాహం చెయ్యాలన్న నిర్ణయానికి వచ్చారు జోగయ్యశాస్త్రి. ఆ నిర్ణయం ప్రకారం కొద్దిరోజులలోనే కోటయ్య శాస్త్రిగారి వివాహం జరిగిపోయింది. వివాహానంతరం ఒకరోజు జోగయ్యశాస్త్రిగారు కుమారుడితో యిలా అన్నారు: "నిన్ను పెంచి పెద్దచేసి వివాహం కూడా జరిపించాను. ఇంతటితో నీ విషయంలో నా బాధ్యత తీరిపోయింది. ఉద్యోగమే చేసుకుంటావో, వ్యాపారమే చేసుకుంటావో నీ యిష్టం. ఇక నుండీ నీ కుటుంబ పోషణ బాధ్యత నీవే భరించటం నీ ధర్మం."

తండ్రి హెచ్చరికను అర్థం చేసుకున్న కోటయ్యశాస్త్రిగారు వెంటనే ఉద్యోగార్థమై యింటి నుండి బయలుదేరి హైద్రాబాద్ నగరం చేరుకున్నారు. ఆ రోజు తెలిసిన వారింట్లో బసచేసి మరునాటి వుదయం వుద్యోగం వెతుక్కుంటూ బయలుదేరారు. నిజానికి అతనికి చెప్పుకోవటానికి ఎలాంటి విద్యార్హతలు లేవు. అయినా అంత పెద్ద నగరంలో తనకు తగిన ఏదో ఒక పని దొరక్కపోతుందా అనుకున్నారు. అయితే అంతలోనే అతని మనసులో సంఘర్షణ మొదలైంది. ఈ పాంచభౌతిక దేహపోషణ కోసం యింత సమయాన్ని వెచ్చించటం వ్యర్థం. ఆ సమయాన్ని తపోనిష్ఠలో గడిపితే అదే సరైన నిర్ణయమని తోస్తున్నది. ఋణానుబంధం నన్ను సంసారిని చేసింది. అయినప్పటికీ రాజరాజేశ్వరీ మాతను నమ్ముకున్న నా మనస్సు యితర వ్యాపకాలలో బంధింపబడటం అసంభవం. తనను నమ్ముకున్న వారిని ఆ దేవదేవి వారి జీవిత బాధ్యతలను స్వీకరించక విడచిపెట్టదు కదా! నీట ముంచినా, పాల ముంచినా ఆమెదే భారం - ఇలా ఆలోచిస్తూ నడుస్తున్నారు కోటయ్య శాస్త్రిగారు. ఆ మహానగరంలో ఒక విశాలమైన వీధిలో నడుస్తున్న శాస్త్రిగారికి రోడ్డు ప్రక్కన వున్న ఒక విశాలమయిన ఒక పెద్ద భవనం ముందు జనం గుమిగూడి వున్న దృశ్యం కనిపించింది. విషయం తెలుసుకొనటానికై భవనం లోపలికెళ్లారు శాస్త్రిగారు.

ఆ యింటి యజమాని తీవ్రరోగ గ్రస్తుడై ప్రాణాపాయ స్థితిలో వుండటం చూశారు. అప్పుడు అక్కడున్న వారందరి దృష్టి శాస్త్రిగారిపై పడింది.

చామనఛాయ రంగులో అయిదున్నర అడుగుల దృఢమైన శరీరం, పంచెకట్టు, నుదుటన గంధపురేఖల నడుమ కుంకుమ బొట్టు, ప్రశాంతవదనం - కళ్ళ ఎదుట కనిపిస్తున్న కోటయ్య శాస్త్రిగారు ఎందుకోగాని, అచటి వారందరికీ 'నారాయణగారికి వైద్యం చేయటానికి వచ్చిన ఘనవైద్యుడు' గా కన్పించారు. ఆయనను చూస్తూనే బంధువులంతా శాస్త్రిగారి కాళ్ళపైబడి రోగికి ప్రాణదానం చేయండంటూ వేడుకోసాగారు. దిగ్భ్రాంతులైనారు శాస్త్రిగారు. 'ఏమిటి వీరు యిలా భావిస్తున్నారు? నేనేమిటి? వైద్యుడననటం ఏమిటి? ఎందుకు వీరికిలా అనిపిస్తున్నది?' అని తలపోస్తూ, తానెవరో తెలుసుకోకుండానే ఎంతో ఆశతో రోగికి వైద్యం చేయండంటూ తననంతగా ప్రార్థిస్తున్న వారికి తాను వైద్యుణ్ని కానని ఎలా చెప్పాలో తోచక దైవాన్ని తలచుకొని ఒక్క క్షణం కన్నులు మూసుకున్నారు శాస్త్రిగారు. వెంటనే దైవనిర్ణయం ఆయనకు స్ఫురించింది. 'ఇదంతా పరమాత్మ ఆడుతున్న వింత నాటకం' అనుకొని నవ్వుకున్నారు. వెంటనే తన చేతి సంచిలో నుండి ఒక వస్తువును బయటకు తీశారు. అదే అక్షతల పెట్టె! అరటి చెట్టు బోదెలోని మెత్తని అరిటి ఊచను కాల్చి మసి చేస్తారు. ఆ మసిని మంచిగంధములో కలిపి బియ్యపు గింజల సైజులో చిన్న చిన్న అక్షతలుగా చేసి ఎండ పెడ్తారు. మంచిగంధముతో చేసిన చిన్న డబ్బాలో ఆ గంధాక్షతలను భద్రపరచుకొంటారు. దానినే అక్షతల పెట్టెలేకడబ్బాఅంటారు.శుభకార్యాలకు బంధుమిత్రులను ఆహ్వానించే సమయంలో ఆడవారు కుంకుమ బొట్టు పెట్టి స్త్రీలను ఆహ్వానిస్తుంటే, మగవారు తాంబూలములో యీ గంధాక్షతలుంచి పురుషులకిచ్చి ఆహ్వానించటం సంప్రదాయం. ఆ డబ్బాలను మగవారు ఎల్లప్పుడూ తమ వద్దనే వుంచుకొంటుంటారు. ప్రతిరోజూ ఆ అక్షతలను నీటిలో తడిపి నుదుట బొట్టుగా కూడా మగవారు ధరిస్తారు.

శాస్త్రిగారు ఆ అక్షతలను నీటిలో అరగదీసి, ఆ గంధాన్ని నీటిలో కలిపి రోగి చేత ఆ నీటిని త్రాగించారు. కొద్ది నిమిషాలకే రోగి కొంచెం తేరుకున్నాడు. అలా మూడురోజులు మూడు పూటలా ఆ గంధపు నీటిని త్రాగించారు శాస్త్రిగారు. నాల్గవ నాటి కల్లా రోగి, రోగవిముక్తుడై కోలుకొని లేచి మామూలుగా తిరుగసాగాడు.

ఆ భవన యజమాని నారాయణ ఆవిధంగా దైవానుగ్రహంతో శాస్త్రిగారి వలన రోగవిముక్తుడైనాడు. నారాయణ ధర్మాత్ముడుగా దానశీలిగా, పేదల పాలిటి పెన్నిధిగా ఆ ప్రాంత ప్రజలందరికీ ప్రేమ పాత్రుడైనాడు. అటువంటి పుణ్యాత్ముడు ప్రాణాపాయ స్థితిలో వున్నాడన్న వార్త విన్న ప్రజలు పరుగుపరుగున నారాయణ యింటికి చేరుకున్నారు. పునర్జన్మను పొందినట్లుగా తలచి కృతజ్ఞతతో శాస్త్రిగారి పాదాలపై పడ్డాడు నారాయణ! ఇక అక్కడి బంధుమిత్రుల, ప్రజల ఆనందానికి అవధులు లేవు. అందరూ శాస్త్రిగారికి బ్రహ్మరథం పట్టారు.

- సశేషం

# మాతృదేవి స్మృతులు

**శ్రీమతి ఆలపాటి మోహన సుప్రియ**

పూజ్యశ్రీ అమ్మగారు, పూజ్యశ్రీ మాస్టరుగారు గురించి ఆలపాటి మోహన సుప్రియ నమస్కరించి వ్రాయునది.

2011 మార్చిలో నాకు శ్రీ ఆలపాటి శ్రీకాంత్ గారితో వివాహము జరిగినది. నాకు పూజ్యశ్రీ మాస్టరుగారి గురించి, పూజ్యశ్రీ అమ్మగారి గురించి అసలు ఏమీ తెలియదు. వివాహము అయిన తరువాత మాత్రమే నాకు పరిచయం అయ్యారు.

మావారు అప్పటికి15 సంవత్సరాల ముందు నుంచే పూజ్యశ్రీ అమ్మగారి దర్శనానికి వస్తూ ఉండేవారట. వివాహం అయిన వారం రోజులకి మావారు పూజ్యశ్రీ అమ్మగారి దగ్గరకు దర్శనార్థం నన్ను తీసుకువచ్చారు. అలా వచ్చే దారిలో నాకు చాలా ఆలోచనలు వచ్చాయి. పూజ్యశ్రీ అమ్మగారి దగ్గరకు వచ్చి సత్సంగం హాలులో కూర్చున్నాము. అదే తొలిసారి అమ్మగారిని చూడటం. అప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు ఏదో పుస్తకంలో ఒక పేజీ తీయించి సత్సంగ సభ్యుల చేత చదివించారు. నా మనసులో ఏవైతే ఆలోచనలు కలిగాయో ఏవైతే ప్రశ్నలు కలిగాయో అవే ప్రశ్నలు, ఆలోచనలు గురించి గ్రంథంలో వచ్చాయి. నాకు చాలా ఆశ్చర్యం వేసింది. సత్సంగం అయిపోయాక పూజ్యశ్రీ అమ్మగారు నన్ను 'కొత్త కోడలు' అని అందరికీ పరిచయం చేశారు. అప్పుడు నేను 'ఇదేంటి ఇలా పరిచయం చేస్తున్నారు' అని అనుకున్నాను. కానీ ఆ రోజు నుంచి మా ఇంట జరిగిన ప్రతి కార్యక్రమమూ పూజ్యశ్రీ అమ్మగారి నిర్ణయం ప్రకారం జరుగుతూ వచ్చింది. అంతేకాక నన్ను కూడా వారి కుటుంబంలో ఒకరిగా చూస్తూ, సమస్యలప్పుడు సకాలంలో నన్ను హెచ్చరిస్తూ, సమయానికి నన్ను కాపాడుతూ వస్తూనే ఉన్నారు. పూజ్యశ్రీ అమ్మగారి మాట ఎలా ఉండేదంటే సూటిగా హృదయం లోపలికి హత్తుకునేలా ఉండేది. పూజ్యశ్రీ అమ్మగారు నాకు ఎక్కువగా స్వప్నాలలో కనిపించి చెప్పేవారు.

2012వ సంవత్సరంలో పూజ్యశ్రీ అమ్మగారికి ఎక్కువగా అందరూ భిక్షలు సమర్పించుకునే వారు. 'నాకు అంతమందికి భిక్ష చేయడం కుదురుతుందా' అని అనుకునేదాన్ని. కానీ అమ్మగారు నాకు భయం లేకుండా, దాదాపు 70 మంది వరకు భిక్ష చేయగలిగే ధైర్యం ఇచ్చారు, చేయించారు. పూజ్యశ్రీ అమ్మగారు మా చేత అంటే నాగోలు సత్సంగ సభ్యులలో ఉన్న ఆడవారి చేత, చాలా రకాల వంటకాలు కూడా చెప్పి చేయించేవారు. నేను అమ్మగారి దగ్గర ఎన్నోరకాల పచ్చళ్లు చేయడం నేర్చుకున్నాను. నాకు పచ్చళ్ళు పెట్టడం గురించి అసలు తెలియదు. కానీ ఒకసారి అమ్మగారు పచ్చళ్ళు పెట్టిస్తుంటే నేను దూరంగా కూర్చుని ఉన్నాను, నాకు రావు కదా ఎందుకులే అని. అప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు నన్ను పిలిచి పక్కన కూర్చోపెట్టుకొని ప్రతి పచ్చడి ఎలా కలపాలో చెప్పి దగ్గరుండి చూపించారు. "చిన్న వయసు పిల్లలు మీరే నేర్చుకోవాలి" అని చెప్పి చేయించారు. పూజ్యశ్రీ అమ్మగారి కోసం స్వయంగా భిక్ష చేసుకునే అవకాశం చాలాసార్లు ప్రసాదించారు. అప్పుడు ఎలా వండాలి, ఎలా చేయాలి అని కూడా చెప్పేవారు.

పూజ్యశ్రీ అమ్మగారు నాకు చాలా అనుభవాలు ఇచ్చారు. నాకు గర్భం



రాకముందు మమ్మల్ని దత్తక్షేత్రాలు అన్నీ దర్శనం చేసుకొని రమ్మన్నారు. తర్వాత 2013 లో నాగోలులో సత్సంగ సభ్యులందరి చేత దీక్షలు చేయించారు. అప్పుడు దీక్షలు చేయడానికి నాకు చాలా భయం వేసింది. అందులోనూ నాకు అదే మొదటిసారి. అప్పుడు "అమ్మగారు నీవు చేయగలిగినంత వరకు చేయి. కానీ దీక్షలో భాగంగా ఇక్కడ ఉండి దీక్ష చేయి" అని చెప్పారు. నేను అలాగే చేశాను. దీక్షల తరువాత మా ఆఖరి దత్తక్షేత్రం శిరిడీ యాత్ర జరిగింది. యాత్రల తరువాత నాకు ప్రెగ్నెన్సీ కన్ఫర్మ్ అయ్యింది. ఆ తరువాత నాకు చాలా ఆరోగ్య సమస్యలు వచ్చాయి. కానీ అవన్నీ వదిలేసి నన్ను కూడా అమ్మగారితో పాటు గాణగాపూర్, మాణిక్యనగర్ యాత్రలకి రమ్మనిచెప్పి తీసుకొనివెళ్ళారు. యాత్రలో భాగంగా మాణిక్యనగర్ వెళ్ళాము. అక్కడ నాకు హాస్పిటల్ పేరు డాక్టరు గారు గురించి చెప్పి అక్కడ వైద్యం చేయించుకోమని చెప్పారు. ఆ తరువాత నాకు తొమ్మిది నెలలు ఒక్కొక్క లీలగా జరుగుతూనే వుంది. అయిదవ నెలలో సీమంతానికి కూడా పూజ్యశ్రీ అమ్మగారు చీర పంపి ఆ చీర మీద సీమంతం చెయ్యమని చెప్పి పంపారు. ఆ 9 నెలలలో నాకు ఎప్పుడు ఏమి తినాలనిపిస్తే అవి ఆ రోజు నిలయంలో ప్రసాదంగా ఉండేది. చివరికి ఊది ఇచ్చి ఆశీస్సులు ఇచ్చి ఆపరేషన్ కి పంపారు. నాకు బాబు పుట్టాడు.11 వ రోజు పుణ్యాహవచనం కి కూడా వేదపండితుల ఆశీస్సులు ఇప్పించాలని చెప్పి చేయించారు. 2013 దత్తజయంతి రోజున పూజ్యశ్రీ అమ్మగారి చేతులమీదుగా 'మనంత యోగనాథ్ భరద్వాజ' అని నామకరణం జరిగింది.

11 వ నెల బాబు జుట్టు తీయించడం కూడా ఎంతో బాగా జరిపించారు. అంటే భజన, ఏకాహం చేయిస్తూ నిలయం బయట జుట్టు తీయించారు. మొదటి పుట్టినరోజున కూడా పూజ్యశ్రీ అమ్మగారి సత్సంగం జరిగింది. ఇలా ప్రతి విషయాన్ని డేటు టైము అన్ని చెప్పి చేయించేవారు.

మా చిన్నబాబు భావేశ భరద్వాజ పుట్టినప్పుడు పూజ్యశ్రీ అమ్మగారి ఆరోగ్యం సహకరించకపోయినా దత్తజయంతి రోజున నామకరణం, అన్నప్రాశన నిలయంలోనే చేయించారు. అంతేకాకుండా మాకు మాస్టరుగారి పాదుకలు ప్రసాదంగా ఇచ్చి మా పిల్లల ప్రతి పుట్టిన రోజున అభిషేకం చేయమని చెప్పారు. అప్పటి నుంచి మా పిల్లల ప్రతి పుట్టిన రోజుకు మాస్టరుగారి పాదుకలకు అభిషేకం చేయడం జరుగుతూనే ఉంది.

మా చిన్నబాబుకి నాలుగు సంవత్సరాల వరకు మాటలు రాలేదు. మేము పూజ్యశ్రీ అమ్మగారిని అడిగితే "భయం లేదు మాటలు వస్తాయి" అని చెప్పేవారు. అలానే వాడికి మాటలు వచ్చాయి. వాడు బాగా అల్లరి చేస్తుంటాడు. అందుకని వాడిని 'అవధూత' అని ముద్దుగా పిలిచేవారు.

పూజ్యశ్రీ అమ్మగారు మాకు ఏం చెప్పాలన్నా స్వప్నం ద్వారానే తెలియజేసేవారు. మాకు ఏ విధమైన ఆరోగ్యసమస్యలు ఉన్నా కానీ మేము చెప్పుకున్నప్పుడు వివరం కనుక్కొని మరీ కాపాడేవారు. ఇలా మాకు అమ్మగారు 'కుటుంబ పెద్ద' గా అన్ని కార్యక్రమాలు చేయించేవారు. గురువుగా బోధించేవారు, తల్లిలా ప్రేమగా చూసుకునేవారు, ఆపదలో దైవంగా ఆదుకునేవారు. ఇలా అమ్మగారి గురించి చెప్పాలంటే ఎంతైనా సరిపోదు.

ఇప్పుడు అమ్మగారు మన మధ్యలో సశరీరంగా లేకపోయినా సమాధి నుండి మన అందరిని ఎప్పటికీ కాపాడుతూనే ఉంటారని ఆశీస్సులు ఇస్తారని ప్రార్థిస్తున్నాను.

# వార్తాలాపము

(గత సంచిక తరువాయి)

శ్రీమతి అడిదం వేదవతి

శ్రీ ప్రకాశానంద స్వామివారిచే విరచితమైన వార్తాలాపమనే యీ గ్రంథము గ్రాంథికభాషలో వ్రాయబడి వుండటం వలన తమకు అర్థంగావడం లేదని చాలామంది పాఠకులు అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. అందుకని పాఠకుల అభ్యర్థన మేరకు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ప్రియపుత్రిక శ్రీమతి అడిదం వేదవతిగారు సరళమైన భాషలో ఈ గ్రంథాన్ని పాఠకులకు అందజేస్తున్నారు - ఎడిటర్.

## తొమ్మిదవ ప్రసంగము

**2. సత్త్వసంశుద్ధిః** - సత్త్వము అంటే అంతఃకరణము. అంతఃకరణములో రాగద్వేషాలు పూర్తిగా లేనపుడు అది పూర్తిగా నిర్మలము, పరిశుద్ధము అవుతుంది. అదే సత్త్వసంశుద్ధి. 'రాగము' అంటే మాయ నుంచి పుట్టిన పదార్థాలపట్ల (విషయాలపట్ల) భోగాపేక్ష. అది అసుర స్వభావము. 'ద్వేషము' అంటే కాయిక, వాచిక, మానసిక మార్గాల ద్వారా ఇతరులను చంపాలని, విషం ఇవ్వాలని, బలవంతంగా ధనం దొంగిలించాలని, తప్పుడు సాక్ష్యాలను సృష్టించి బలవంతంగా కోర్టుకు ఈడ్చాలని, ఇటువంటి క్రూరత్వము ప్రధానంగా కల పనులు. అంటే రాక్షస స్వభావము. ఇవి అన్నీ నిర్మూలించబడిన అంతఃకరణము పూర్తిగా నిర్మలమై పరిశుద్ధమౌతుంది. దాని పేరే సత్త్వసంశుద్ధి. ద్వేషము మొ॥న వాటితో కూడిన రాక్షస స్వభావము నిష్కామకర్మ ద్వారా మాత్రమే నివృత్తి చెందుతుంది (నివారణవుతుంది). రాగము మొ॥న వాటితో కూడిన అసుర స్వభావము ఉపాసన ద్వారా నివృత్తి పొందుతుంది.

**3. జ్ఞానయోగ వ్యవస్థితి :** పరోక్షముగా పరమాత్మ స్వరూపం యొక్క యదార్థాన్ని తెలుసుకోవడం జ్ఞానము. దీనిని పొందడానికి మంత్రము, లయ, హఠ, రాజ యోగాలు అనే నాలుగు రకాల ప్రయత్నాలు వున్నాయి. వాటిలో స్థిరంగా వుండడం 'జ్ఞానయోగ వ్యవస్థితి' అనబడుతుంది.

**4. దానమ్ :**

*శ్లో॥ స్తోకాదపి చ దాతవ్య*
*మదీనేనాన్తరాత్మనా I*
*అహన్యహని యత్కించత్*
*అకార్పణ్యం తు తత్ స్మృతమ్ II*

(బృహస్పతి)

భావం :- తన అంతఃకరణాన్ని ఉదారంగా నుంచి తన దగ్గర కొంచెము వున్నా, దానిలోనే ప్రతిరోజూ కొంచెం కొంచెం ధర్మం చేయడం అకార్పణ్యము - అంటే దానము అని చెప్పబడుతుంది.

మానవునికి ధనం పట్ల తృష్ణ ఎక్కువైన కొద్దీ దానము చేయడం కష్టమనిపిస్తుంది.

*శ్లో॥ దానాన్న దుష్కరం తాత*
*పృథివ్యామస్తి కించన l*
*అర్థే చ మహతీ తృష్ణా*
*స చ దుఃఖేన లభ్యతే ll*

భావం: దానం కంటే కష్టమైనది భూమిలో లేదు. ధనము ఎంతో కష్టంతో గానీ లభించదు. కాబట్టి దానియందు అంత తృష్ణ వుంటుంది.

అయినా దానము తన కర్తవ్యంగా భావించి, నిష్కామ బుద్ధితో శక్తి ననుసరించి, సమయాన్ని, పాత్రతను విచారించి, అన్నము, వస్త్రము, విద్య, ఔషధము మొ॥నవి దానం చేయడం మానవుని కర్తవ్యము.

**5. దమః** - దమము గురించి శ్రీ ఆదిశంకరాచార్యులు ఇలా సెలవిచ్చారు.

*నిగ్రహో బాహ్యావృత్తీనాం దమ ఇత్యభిధీయతే l*

భావం : బాహ్యావృత్తులను నిగ్రహించడం దమమనబడుతుంది. జ్ఞానం పొందడానికి దమము ఎంతో అవసరము. కాబట్టి దానికి శాస్త్రాలలో ఎక్కువ పాముఖ్యత ఇవ్వబడింది.

*శ్లో॥ దమేన సదృశం ధర్మం*
*నాన్యలోకేషు శుశ్రుమః l*
*దమో హి పరమో లోకే*
*ప్రశస్తః సర్వధర్మిణామ్ ll*

భావం: దమము లాంటి మరొక ధర్మము ఏదీ ప్రపంచంలో కనిపించదు. అన్ని మతాలలోనూ దమము ఎంతో ఉత్తమమైనదిగా గుర్తించబడుతుంది.

దమము వలన ఈ లాభం కలుగుతుంది:

*శ్లో॥ ప్రేత్య చాముత్ర మనుజః*
*పరమం విన్దతే సుఖమ్ l*
*దమేన హి సమాయుక్తో*
*మహాన్తం ధర్మమశ్నుతే ll*

భావం : దమాన్ని పాలించినవాడు ఈ లోకంలోనూ, పరలోకంలోనూ సుఖపడతాడు. ఇది చాలా గొప్ప ధర్మము.

**(6) యజ్ఞః** - శాస్త్ర విహితములైన కర్మలు యజ్ఞాలు. ఈ యజ్ఞాలు రెండు రకాలు. శ్రుతులచేత ప్రతిపాదించబడినవి. స్మృతులచేత ప్రతిపాదించబడినవి. అగ్నిహోత్రము, ధర్శపౌర్ణమావాస్యలు, సోమయజ్ఞము మొ॥నవి శ్రౌతయజ్ఞాలు. దేవయజ్ఞము, ఋషియజ్ఞము, పితృయజ్ఞము, మనుష్యయజ్ఞము, భూతయజ్ఞము - ఈ ఐదు స్మార్తయజ్ఞాలు.

దేవయజ్ఞము - అగ్నిహోత్రాదులు,

ఋషియజ్ఞము - వేదాధ్యయనము, సంధ్య, గాయత్రీ, జపము మొ॥వి.

పితృయజ్ఞము - తర్పణము, శ్రాద్ధాదులు. మనుష్యయజ్ఞము - అతిథి సేవ మొ॥నవి. భూతయజ్ఞము - బలి (కాక బలి), వైశ్యదేవము మొ॥వి.

వీటన్నింటిలో జపయజ్ఞము శ్రేష్ఠమైనది. "యజ్ఞానాం జపయజ్ఞోస్మి" 'యజ్ఞాలలో జపయజ్ఞము నేను' అని భగవంతుడు భగవద్గీతలో చెప్పాడు.

**(7) స్వాధ్యాయః :** వేదాధ్యయనము. భగవంతుడి గుణాలు, ప్రభావము, తత్త్వము, స్వరూపము, ఆయన దివ్యలీలల వర్ణన కల వేదాలను అభ్యసించడము, శాస్త్రాలు, ఇతిహాసాలు, పురాణాలు మొదలైనవాటిని పఠించటము, భగవంతుడి నామ గుణ కీర్తనము - ఇవన్నీ స్వాధ్యాయమే.

'వేదాభ్యాసము' అంటే ఋగ్వేదము మొదలైన నాలుగు వేదాలు, వేదాంగాలైన శిక్ష, కల్పము, వ్యాకరణము, నిరుక్తము, ఛందస్సు, జ్యోతిష్యము - వీటిని చదవడం వేదాధ్యయన మనబడుతుంది. ఇవి చిన్నప్పటినుంచి కాశి మొదలైన ప్రదేశాలలో వుండి అభ్యసించాలి.

ఈ రోజులలో ఇవి ఎంతోమంది చదవటం లేదు. ఇప్పటివారు భగవద్గీత, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు అధ్యయనం చేసి సంతృప్తిపడతారు. ఆ మాత్రం చేయలేకపోయినా, భగవద్గీతను గురువు దగ్గర అభ్యసించి, నిత్యము మననం చేసుకుంటూ ఆచరణలో పెట్టాలి. భగవద్గీతా సారమైన దైవగుణాలను భక్తితో ఆచరించాలి.

**8.తపః** - తపము కాయికము (శరీరంతో ఆచరించేది),

***మిగతా 29వ పేజీలో***

(గత సంచిక తరువాయి)

# మార్గదర్శి

శ్రీ సూర్యప్రకాష్

**(విద్యానగర్ కాలేజీలో లెక్చరర్ గా పనిచేసిన వీరు "ఎంతో మేధాసంపన్నులైన మాస్టరుగారితో నా పూర్వజన్మ పుణ్య ఫలితంగా కలిగిన ఎన్నో సంవత్సరాల సాంగత్యంలో నా జీవితం పునీతమయిందన్న ఆనందాన్ని, నా అదృష్టాన్ని ఏమని వర్ణించగలను?" అంటూ వారితో గల అనుబంధాన్ని గురు బంధువులతో పంచుకున్నారు.)**

మాస్టార్ గారు మంచి వక్త. ఒకసారి మా కాలేజీలో జరిగిన ఫంక్షన్ కి రావాల్సిన వక్త రాలేదు. అప్పుడు మాస్టారు సైన్స్ అండ్ స్పిరిట్యువాలిటీ మీద ఏమి ప్రిపేరు అవకుండానే రెండు గంటల సేపు ఏకధాటిగా మాట్లాడారు. ఆనాటి వారి ప్రసంగ సారాంశం, మనస్సు కాంతి కంటే ఎంతో వేగంగా వెళ్తుంది. అలాంటి మనస్సును ఎలా అరికట్టాలో, యోచనను ఎలా కంట్రోల్ చేయాలో వివరించారు. భౌతిక శాస్త్రం ఎంతగా వృద్ధి చెందిందో దాన్ని గురించి చెప్పారు. ఇప్పుడు ప్రతి దానిని సైంటిఫిక్ గా ప్రూఫ్ చేయడమన్నది ఒక ఫ్యాషన్‌గా మారింది. కానీ యోగము, ఆధ్యాత్మికత అన్నది ఎన్ని యుగాల నుంచో వస్తున్నది. కానీ సైన్సు పుట్టుక ఈ మధ్యనే! సనాతనమైన ఆధ్యాత్మిక విద్యను నిన్న మొన్న రూపుదిద్దుకొన్న సైన్స్ తో పోల్చి తప్పో, ఒప్పో నిర్ధారించటం ఎలా? పరిమితమైన మన యింద్రియ పరిజ్ఞానముతో అపరిమితమైన ఆధ్యాత్మిక విద్యను ఎలా పోల్చగలం? అన్న అంశంపైననే ఆయన ప్రసంగించారు. అందరూ 'అత్యద్భుతం' అన్నారు.

పిల్లలంటే మాస్టార్ గారికి చాలా యిష్టం. "పిల్లలకు బాల రామాయణాన్ని ముఖ్యంగా చెప్పించాలి. దాని వల్ల వారిలో గ్రహణ శక్తి పెరుగుతుంది. రిటెన్షన్, రికాపిట్యులేషన్ అండ్ రిప్రొడక్షన్ పెరుగుతుంది. నేటి కాంపిటేషన్లో రావాలంటే ఈ మూడూ పెరగాలి. బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా వారు మోనోగ్రాఫ్స్ వ్రాస్తున్నారు. నెహ్రూ, ఠాకూర్, వివేకానందల గురించి సంక్షిప్తంగా వివరిస్తున్నారు. ఇవి పిల్లలకు తప్పకుండా అందించాలి. సంస్కృత పరిచయం కల్గించాలి. శబ్ద మంజరి నేర్పించాలి. వీలైనంత వరకు పిల్లలకు 6, 7 సంవత్సరాలలో ఉపనయనం చేయించటం, నమకం, చమకం నేర్పించటం చాలా అవసరం. ఎందుకంటే వేదసాంప్రదాయం రానురాను చాలా వరకు తగ్గి పోతున్నది. అందువల్ల యివన్నీ పిల్లలకు చెప్పించాలి" అని చెప్పేవారు. "కాలానుగుణంగా ఇంగ్లీషు కూడా బాగా నేర్పించాలని" చెప్పేవారు.

చిన్నప్పట్నించే పిల్లల్లో పెద్దలన్నా,

దేశమన్నా భక్తి బీజాలని నాటాలి. పిల్లల కోసం చందమామలాంటి పుస్తకాలలో మంచి సాహిత్యాన్ని అందించాలి అని ఆయన అభిలాష. దీని విషయమై మేమిద్దరం మాద్రాసులోని 'చందమామ' ఆఫీసుకి కూడా వెళ్ళాం. "చిన్న పిల్లలకు హారతులు, భజనలు అలవాటు చేయాలి. బాబా చరిత్రను చిన్న చిన్న కథల రూపంలో వారికి చెప్పాలి. వారిచేత కూడా చెప్పించాలి" అని అనేవారు.

"పిల్లలు తప్పుగా ప్రవర్తిస్తున్నారంటే దానికి బాధ్యులు పెద్దవారే. తల్లిదండ్రులు మంచి మార్గాన్ని తామాచరిస్తూ పిల్లలని ఆచరించమని చెప్పాలి. అది తెలియకపోతే ముందు తాము నేర్చుకొని తర్వాత పిల్లలకు నేర్పాలి" అని చెప్పేవారు.

మా పిల్లలందరికీ అక్షరాభ్యాసం మాస్టార్ గారే చేశారు. మా పిల్లవాడికి అక్షరాభ్యాసం చేసేటప్పుడు వారు ఒక మాటన్నారు. "హి ఈజ్ ఎ బ్లాంక్ చెక్" అన్నారు. వారి ఆశీర్వచనం వల్లనే వాడు పెద్ద చదువులు చదివి మంచి పోజిషన్లో వున్నాడు. మావాడికి వేదం నేర్పించమన్నారు. ఏడవ సంవత్సరంలో ఉపనయనం చేయించమని చెప్పారు. అందుచేత వారినే ఆ ఉపనయన సంస్కారం చేయమని కోరగా, వారే చేశారు. సంధ్యా వందనంతో పాటు నమకం, చమకం, పురుష సూక్తం, శ్రీ సూక్తం, సూర్య నమస్కారాలు నేర్పించాను. సంధ్యా వందనం గురించి చెప్తూ "అది ఒక శారీరిక అభ్యాసంలా వుండరాదు. త్రికరణశుద్ధిగా చేస్తే సత్ఫలితాలుంటాయి. సంధ్యావందనం వల్ల మేధస్సు పెరుగుతుంది. గ్రహణ శక్తి, ధారణ, ప్రబోధన పెరుగుతుంది" అని చెప్పేవారు. అట్లా అని ఆయన మూఢాచారాలకు ఎలాంటి ప్రాముఖ్యత నిచ్చేవారు కాదు. యోగాసనాలు నేర్పిస్తే ఆ కుటుంబం తరతరాలు బాగుపడ్తుంది అనేవారు. ఆయన విశ్వాసం చాలా గొప్పది..

తన తండ్రి ఆబ్దీకం పెడితే చాలా నిష్ఠగా పెట్టేవారు. ఆ మంత్ర భావన ఆయన మనస్సుకు వచ్చేవరకు ఆ క్రియ జరగాల్సిందే. ఒకసారి ఎవరో "మనం పెట్టిన ఈ ఆహారం మన పితృదేవతలకందుతుందా?" అని సందేహం వెలిబుచ్చితే, "టెలిఫోన్లో వార్త ఎలా చేరుతుందో, యిది కూడా అలానే చేరుతుంది. అయితే దీనికి కావాల్సింది శ్రద్ధ, శ్రద్ధతో పెట్టేది శ్రాద్ధం" అన్నారు.

ఆయన మనతో మాట్లాడుతున్నా కూడా సాయి ధ్యాసలోనే వుండేవారు. మనం ఏదన్నా ప్రశ్న వేస్తే దానికి సరైన సమాధానం చెప్పి బాబా ధ్యాసలో కెళ్ళిపోయేవారు. కానీ ఎవరికి ఏ సందర్భంలో ఏమి చెప్పినా పది సంవత్సరాలైనా సరే ఆయనకు జ్ఞాపకం వుండేది. అన్నింటిలో అన్ని రూపాలలో ఆయన బాబానే చూసేవారు. నవ్వుతూ అనుక్షణం బాబా ధ్యాసలోనే వుండటమన్నది వారి దగ్గరే చూస్తాము. ఆయన ఎప్పుడూ సీరియస్ గా వుండేవారు కాదు. చాలా సరదాగా వుండేవారు.

ఆయన ఒక్కోసారి స్నానానికై చాలా నీళ్ళు వాడేవారు. నీళ్ళు పోసుకుంటూ పెదవులు కదలిస్తూ వుండేవారు. బహుశా బాబాకు స్నానం చేయిస్తున్నట్లు భావించేవారేమో.

మాస్టారు షిరిడీ ఎప్పుడు వెళ్ళినా చాలా యిబ్బందులు పడ్తూ వెళ్ళేవారు. ముందుగా టికెట్ తీసుకునేవారు కాదు. ఎప్పుడూ సుఖంగా ప్రయాణం చేసేవారు కాదు. కష్టనష్టాల గురించి అనుకోకుండా వుంటే కర్మ తీరిపోతుందనేవారు. నాకు తెలిసి వారు పగలు పడుకున్నట్లు ఎప్పుడూ చూడలేదు. గంగా ప్రవాహంలా భక్తులు వస్తుండేవారు. రాత్రి రెండు గంటలైనా సరే సమాధానాలు చెప్తూండేవారే.

ఆయన సినిమాలు అవీ తగ్గించమని చెప్తూండేవారు. "అది చాలా కష్టమైన విషయం వీలుపడదు సార్" అన్నాను. "అయినా సినిమాలు ఎందుకు చూడకూడదు సార్?" అని అంటే, "రామాయణం అంటే రాముడు గుర్తురాడు, యాక్టర్ గుర్తుకొస్తాడు. సీత గాక, సీతగా వేసిన యాక్టర్ గుర్తొస్తుంది. అందువల్ల భావం చెడుతుంది. మన భావాలు సత్వగుణ ప్రధానంగా వుండాలి. మనం నిత్యం ఆహార విహార నియమాలు పాటించాలి" అనేవారు. "ఆహార విహారాలు పదిమందితో పెట్టుకోకూడదు. ఇల్ గాసిప్(ill gossip) మంచిది కాదు. ఇద్దరు కలిస్తే మూడో వాడి గురించే మాట్లాడుకుంటాం. అదే గురుచరిత్రలో వస్తుంది. కాకపోతే శ్రోతగా వుండటానికి ఎవర్నైనా పిలుచుకో. నీలో వుండే భావాలకు స్పందించాలి. జవాబు చెప్పేందుకు అంతకు మించి శ్రోతలు పెరిగితే మరో వాడ్ని గురించే మాట్లాడేది. అంత మాత్రం చేత సంఘం నుంచి విడిపోయి ఒక్కడివే వుండమని కాదు. పది మందిలోకి రావాలి. పది మందిలో కొచ్చినప్పుడే మనలో వుండే బలహీనతలు బయట పడతాయి.

అరిషడ్వార్గాలు బయట పడతాయి. అవి బయటకు రావాలి. వస్తేనే కదా నాకింత కోపమొస్తుందా? నా మనస్సులో యింత ద్వేషముందా? నా మనస్సులో యింత మమకారం వుందా? అని మనకైనా తెలిసేది" అని చెప్తూండేవారు.

ఆయన యింకా యిలా చెప్పేవారు. "శవం మీద ధ్యాస పెట్టుకో ఎంత సంపాదించినా చివరకు యింతే కదా అన్నదానికి డెత్-సీన్ ని గుర్తుంచుకోవాలి" అని అనేవారు. అందుకే ఆయన నాకు 'లైఫ్ ఆఫ్టర్ డెత్' అనే బుక్ యిచ్చి చదవమన్నారు. అది చదివితే చనిపోయిన తర్వాత జీవితం ఏమౌతుందోనన్నది తెలుస్తుంది. అందుకని వైరాగ్యం అనేది డెబ్బై ఏళ్ళ తర్వాత కాదు. చిన్నప్పట్నించి ఉగ్గుపాలతో మనం నేర్పిస్తే వస్తుంది.

ఆయనకు క్రీడలంటే చాలా యిష్టం. అందులో క్రికెట్ అంటే చాలా యిష్టం. ఆయన మంచి మీడియం ఫాస్ట్ బౌలర్. నెల్లూరు కాలేజీలో జరిగిన పోటీలో మా ఎన్.బి.కె.ఆర్.కాలేజీ తరపున ప్రాతినిధ్యం వహించారు. ఆయన మంచి ఈతగాడు. ఈత నేర్పడమన్నా చాలా యిష్టం.

మాస్టార్ గారు వార్తాపత్రికలలో ఆధ్యాత్మిక పరమైన ఆర్టికల్స్ వుంటే చదువుతారు. వాటికి సంబంధించిన కొత్త పుస్తకాలు ఏమన్నా వున్నాయేమో అని వాటికై చూసేవారు. అంతేగాని అంతకుమించి ప్రాధాన్యత నిచ్చేవారు కాదు.

"ధర్మం కోసం, ప్రజల మంచి కోసం బొంకినా తప్పులేదు" అని చెప్పేవారు. అధర్మం జరిగేటప్పుడు తప్పకుండా దానిని ఖండించితీరాలి. లేకపోతే అది కూడా ఒక తప్పే. అధర్మాన్ని ప్రోత్సహించినట్లవుతుంది. ధర్మ రక్షణకు 'కరాటే', 'కుంగ్-ఫూ' నేర్చుకోమని, వ్యాయామాలు కసరత్తులు చేయమని చెప్పేవారు. సైనికుల వలె తర్ఫీదు పొందాలని, సైనికునిలా ధర్మం కోసం పోరాడాలని చెప్పేవారు. విద్రోహశక్తులు ఆట కట్టించాలని చెప్పేవారు.

ఆయన మహనీయుడన్నది సుస్పష్టము. ఆయన చెప్పింది చేయటం నిరపాయకరము. ఆయన ఒక మనిషి యొక్క శక్తి సామర్థ్యాలను బట్టి పనులు చెప్తుంటారు. ఒక్కోసారి శక్తికి మించిన పనులు కూడా చెప్తారు. అది సాధన కోసం కావచ్చు. ఎవరికైనా ఒక పనిని చేస్తానని ఒప్పుకున్నప్పుడు ఆ పనిని నిర్దుష్టంగా చేయాలి.

జపం చేయ వీలులేకపోయినా, హారతులకు హాజరు కాకపోయినా ఫరవాలేదు కాని ఒప్పుకున్న పనిని మాత్రం ఎగవేయకూడదని చెప్పేవారు.

ఒకసారి మా పెళ్ళిరోజున అరుణాచలం వెళ్ళాలనుకున్నాను. మాస్టార్ గారేమో మమ్మల్ని చివటం వెళ్ళమన్నారు. "ముందు మీరే వెళ్ళండి, నేను తర్వాత వస్తాను" అన్నారు. అలానే వచ్చారు. మేము పూజ చేస్తుంటే అమ్మేమో మాస్టారు గారికి పూజ చేసింది. అప్పుడు మాకు ఆ యిద్దరూ రెండు దత్త స్వరూపాలుగా కన్పించారు. ఆయన నన్ను తనతో పాటు ఎన్నో దత్త క్షేత్రాలకు తీసుకొనిపోయారు. ప్రతి దత్తక్షేత్రంలోను ఒక తులసి మాలతో నామజపం చేసి, ఆ మాలను నాకిచ్చారు. అంతేగాక ఒక రుద్రాక్షను కూడా యిచ్చారు. వాటినన్నింటినీ ఆయన మాకు ప్రసాదించిన ఆధ్యాత్మిక సంపదగా భద్రపరచుకున్నాం.

భరద్వాజ మాస్టార్ గారి బ్లెస్సింగ్సు ఎలా వుంటాయో చూద్దాం. ఒకసారి మాస్టర్ గారు కారులో వెళ్ళబోతున్నారు. కారు స్టార్ట్ కాబోయే ముందు (1) విష్ణు సహస్రనామం (2) దాసబోధ (3) గాంధీగారి జీవిత చరిత్ర (4) త్యాగరాజ కీర్తనలు (5) వివేక చూడామణి (6) శంకర భాష్యం. ఈ ఆరు బుక్స్ నాకిచ్చారు. మరి కొన్ని బుక్స్ వేటపాలెం గ్రంథాలయానికిస్తూ వీటిని నాకిచ్చి చదవమన్నారు. ఒకసారి ఒంగోలులో వున్నప్పుడు శంకర విజయానికి సారాంశం వ్రాయించారు. వ్రాయించటంలో వారి ఉద్దేశ్యము ఏమిటో తెలియదు, కాని సమయాన్ని చాలా ప్రొడక్టివ్ గా వుపయోగించుకోవాలని చెప్పేవారు. ఆయన ఏదన్నా చెప్పారు అంటే దాన్ని ముందు తను ఆచరించి చెప్పేవారు. అలా ఆయన తన సమయాన్ని ఎప్పుడూ వృధా చేసుకోలేదు.

ధుని ప్రారంభోత్సవానికి వచ్చి టాక్సీలో కూర్చుని 'ఇలా' రమ్మని చెయ్యివూపి విష్ణుసహస్రనామాల్లోని 108 వ శ్లోకాన్ని 108 సార్లు పారాయణ చేయమన్నారు. తర్వాత వెరిఫై చేసుకుంటే ఆ శ్లోకం విష్ణు సహస్ర నామాలన్నింటికి హృదయం వంటిదని తెలిసింది. నాకు మాస్టార్ గారు అలా 108 వ శ్లోకం 108 సార్లు చేసే దీక్ష నిచ్చారు. అలా చేయటం నాకెంతో ఓదార్పు, ఆనందాన్ని ఇచ్చింది. ఆ దీక్ష ఇవ్వటం చాలా సహజంగా, అప్పటికప్పుడు ఇచ్చినట్టుంటుంది కాని, అదేదో ముందు నుంచి ఇవ్వాలి అని

అనుకున్నట్టుగా లేదు. నా జీవితానికొక గమ్యం ఇచ్చారు, ఒక సార్థకతను కల్పించారు. ఐహికంగా నా పిల్లలకు కావాల్సిన ఉన్నత విద్యాబుద్ధులు, ఉన్నతమైన జీవనోపాధి, నేను కోరుకున్న దానికంటే ఎక్కువగానే ఇచ్చి నన్నాదరించారు. మా ఆఖరమ్మాయి కొంత అనారోగ్యంగా వుంటుంది. ఆ అమ్మాయి వల్లనే మీరు ఆధ్యాత్మికతలోకి వస్తారు. ఆమె మీ ఆధ్యాత్మిక వున్నతికి ఒక ఛాలెంజ్ గా భరించండి అని చెప్పారు. నిజం కూడా అంతే. ఆమెను వారు దీవించటమే కాకుండా, ఆ అమ్మాయికి ఎంతో మంది మహాత్ముల దీవెనలు ఇప్పించారు.

నా భార్యకు భాగవతము, భగవద్గీత, సాయిలీలామృతము ఇచ్చి మూడింటిని మార్చి మార్చి పారాయణ చేయమన్నారు. వ్యక్తులను బట్టి ఆయన చెప్పే సాధనా పద్ధతి మారుతూ వుంటుంది.

మాస్టార్ గారు విద్యానగర్ లో వున్నరోజులలో వారు చేస్తున్న ప్రచారం వల్ల దిన దిన ప్రవర్ధమానంగా వారి కీర్తి ప్రతిష్టలు పెరుగుతుంటే కొంతమంది ఈర్ష్య, అసూయల వల్లనైతేనేమి, అమాయకత్వం వల్లనైతేనేమి కొన్ని పుకార్లు లేవదీసి ఆయనకు ఎన్నో యిబ్బందులు కల్గించారు. అవి ఇక్కడ వారి మనుగడకే గాక, ఆయనను గురువుగా భావించి, సేవించిన శిష్యుల మనుగడకి సైతం కొంత ప్రమాదకరమైన పరిస్థితులను తెచ్చి పెట్టాయి. ఒకసారి వూళ్ళో గొడవలుగా వున్నప్పుడు నా భార్య దగ్గరకు ఎవరోవచ్చి మాస్టారుగారిని, నన్ను, యింకా కొంతమందిని బలంగా కొట్టారని నమ్మకంగా చెప్పారు. అప్పుడు రాత్రి 12 గంటలు. నా భార్య మేమున్న చోటికి ఆందోళనతో పరుగున వస్తే ఆమెతో మాస్టారు గారన్నారు. “ఇలాంటి ప్రయత్నాలెన్ని జరిగినా మాకేంకాదు. మమ్మల్నేమీ చేయలేరు, నేనున్నాను కదమ్మా” అని ఆమెను ఓదార్చారు. ఆమెకు అభయమిచ్చారు.

నా పద్దెనిమిది సంవత్సరాల పరిచయ కాలంలో ఆయనను కోపంగా ఎప్పుడూ చూడలేదు. కానీ ఒకసారి మాత్రం ఒక వ్యక్తి కొంతమంది స్వార్థపరుల హస్తాలలో కీలుబొమ్మ అయి ఆయనను పొడవడానికి కత్తి తీసుకుని బయలుదేరి ఒక అరగంటలో వస్తాడనగా ఎఱ్ఱబారిన కళ్ళతో “వాడు కత్తి తీసుకుని వస్తున్నాడు , కానీ నన్నేం చేయగలడు” అని అన్నారు. క్రమంగా ఆ కళ్ళలోని ఎరుపు తగ్గింది. వారి గొంతులోని కాఠిన్యం పోయి మార్దవం వచ్చింది. కొంత సేపటికి మరలా నార్మల్ అయ్యారు. వాడు మాత్రం మాస్టర్ గారికి దగ్గరగా వచ్చి మాస్టారు గారిని చూస్తూనే ఏడుస్తూ మాస్టార్ గారి కాళ్ళ మీద పడిపోయాడు. ఆ తర్వాత “స్వామీ మిమ్మల్ని చూస్తూనే నా శరీరం ఆడటం లేదు. నేనిలా అయిపోయానండి. మీరే నాకు మార్గం చూపించాలండి” అని చతికిలబడ్డాడు. అప్పుడు మాస్టార్ గారు నవ్వుతూ “ఫరవాలేదు. బాబా సహాయం తప్పకుండా వుంటుంది” అని అతనికి ధైర్యం చెప్పారు. అప్పట్నించీ అతను ప్రతి బేస్తవారం వచ్చి మాస్టర్ గారి దగ్గర కూర్చునేవాడు. అతను మూర్ఖుడు, చదువు రానివాడు. అలాంటి వాడు ఆయన ముఖం చూడగానే, ఆయన బ్రహ్మ వర్చస్సు చూడగానే ఆయన స్థితి గ్రహించి కాళ్ళ మీద పడ్డాడు. అంటే ఏమిటి? ఎక్కడ ఏమి జరుగుతున్నదో ఎవరు ఏమి ఆలోచిస్తున్నారో అన్నది ఆయనకు సంపూర్ణంగా తెలుసు. ఆయన సర్వజ్ఞుడు. “ఆయన ఒక లెక్చరర్. మనలాగే ప్యాంటు, షర్ట్ వేసుకొని వస్తారు, వచ్చి కూర్చుని కబుర్లు చెప్తుంటాడు. ఏదో కాలం వెళ్ళబుచ్చుతున్నాడు” అని అనుకునే మనలాంటి వాళ్ళకి ఆయనంటే ఏమీ అర్థం కాలేదని అర్థం.

అంతటి గడ్డు రోజులలో కూడా నేను వెళ్ళి కూర్చుంటే ఒకసారి “ఇంతకు పదిరెట్లైనా సరే బాబా మనకు హాని చేయడు. మనం దృఢమైన విశ్వాసంతో ఆయన్ను నమ్ముకున్నప్పుడు తప్పకుండా మేలు జరుగుతుంది” అని అనేవారు. అటువంటి అననుకూల పరిస్థితులలో మా అందరి శ్రేయస్సు దృష్ట్యా మాస్టార్ గారు తన ఉద్యోగాన్ని విద్యానగర్ ని వదిలి వెళ్ళారు. ఆ తర్వాత చివరి మజిలీగా ఒంగోలు చేరారు. ఆయన ఒంగోలు చేరిన మొదట్లో ఆర్థికంగాను, శారీరకంగాను చాలా యిబ్బందులు పడ్డారు, గానీ ఎవరికీ ఏమీ చెప్పేవారు కాదు. ఒకసారి ఒక భక్తుడు వెళ్ళి కూర్చుంటే “రావు గారొచ్చారు. టిఫిన్ అరేంజ్ చెయ్యి” అన్నారు. వంటింట్లో ఏమీ లేవు. “ఏమిటి సార్ ఇది మాకు చెప్తే సహాయం చేసేవాళ్ళం కదా!” అని అంటే “అడుగో ఆయనున్నాడు చూడండి. ఆయనే కదా! సహాయం చేయవలసింది” అంటూ ఎదురుగా బాబా ఫోటోను చూపించారు. ఆయనకి బాబా మీద అంత అచంచలమైన విశ్వాసం.

- సశేషం


(గత సంచిక తరువాయి)

# రాధాకృష్ణ ఆయీ

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

తర్వాత మధ్యాహ్నం తన భోజనం పళ్ళెంక్రింద ఒక అన్నం ముద్ద దాచివుంచి దానిని పిండంగా బాబా స్వీకరిస్తే తన గురువు బాబాలోనే వున్నదని నమ్ముతానని మనస్సులో అనుకున్నాడు అవస్తే. కాని మశీదులో అడుగు పెట్టగానే అతడి కాలుజారి ఆ ముద్ద క్రిందబడింది. దానిని అతడు చేతిలోకి తీసుకొని బాబా దగ్గరకు వెళ్ళగానే ఆయన చేయిచాపి, "అది నాకివ్వు, అది స్వీకరించి నీవు కోరిన వారికి చేర్పిస్తాను" అన్నారు. అంతటితో అవస్తేకు ఆవేశం వచ్చి, "ఓహో, నా గురువు చనిపోయిందిగదా, మరి యీయన బ్రతికున్నాడేమిటి?" అని కేకబెట్టాడు. అతనికెక్కడ చూచినా బాబా కన్పిస్తున్నారు. ఆయన తమ మంత్రశక్తితో తనను చంపాలని చూస్తున్నారని భ్రమించి అతడు కేకలు పెడుతూ పిచ్చివాడిలా ప్రవర్తించాడు. భక్తులు వెంటనే అతనిని మశీదునుండి తీసుకెళ్ళిపోయారు. సాయి దివ్యావతారమని ఎవరెంత చెప్పినా అతడంగీకరించలేదు. సాయి తనపై మంత్రప్రయోగం చేస్తున్నారని తలచి దానిని పారద్రోలడానికి, 'శ్రీరాం, శ్రీరాం' అని కేకలు పెట్టసాగాడు. ఆయీతో గూడ, "ఏమిటి నిన్ను నాశనం చేయడమేగాక నన్నుగూడా చంపాలని చూస్తున్న ఈ దుష్ట మాంత్రికుడి (బాబా) చేతిలో చిక్కావా" అని కేకలేశాడు. అప్పుడు ఆయీ, రేగే సాయి వద్దకు వెళ్ళి అవస్తేను చిత్తభ్రమ నుండి కాపాడమని ప్రార్థించారు. బాబా ఏమీ మాట్లాడలేదు. రాత్రంతా అతడలానే కేకలేస్తున్నాడు. తెల్లవారగానే చావడిలో సాయి, అత్యంత మధురమైన కంఠంతో, 'అల్లామాలిక్' అని కేకలేసారు. ఆయీ యిల్లు అక్కడకు దగ్గరే గనుక ఆ వాణి అతని చెవినబడగానే అతడి భ్రమలన్నీ తొలగిపోయాయి. తన బుద్ధివికారాలకు అతడు మనసులోనే క్షమాపణ చెప్పుకున్నాడు. బాబా ఉదయం ఆరతి అయ్యాక రేగేను పిలిపించి, "ఆ పిచ్చివాణ్ణి శిరిడీ నుంచి తీసుకుపోండి!" అని ఆదేశించారు. గుఱ్ఱపుబండి సిద్ధం కాగానే గ్రామద్వారం వద్ద ఆ యిద్దరూ బాబాకు నమస్కరించి బయల్దేరారు. అప్పటినుండి అవస్తేకు సృష్టిలోని ప్రతి మగప్రాణి సాయిగాను, ప్రతి ఆడప్రాణి ఆయీ రూపంగానూ తోచసాగాయి. ఈ అనుభవం లెండీ బాగ్ దాటేదాక కొనసాగి, అటు తర్వాత అంతరించింది. అటు తర్వాత అవస్తే కొద్దిసార్లు తన మిత్రులతోను, కుటుంబంతోనూ కలసి వచ్చి బాబాను దర్శించాడు.

అవస్తే వృత్తాంతంలో మనం గుర్తించవలసిన ముఖ్యాంశాలు మూడున్నాయి; అతడొకవంక మహాత్ముల సాంగత్యము కోరుతున్నాడు, మరోవంక వాళ్ళల్లో ఎవరినీ గురువుగా స్వీకరించడానికి అతని అహంకారం అడ్డువచ్చింది. ఒకవంక అందరినీ ఆత్మజ్ఞానము కోరుతున్నాడు. మరోవంక సాక్షాత్కారము అవబోతుంటే భయపడి ఆ సాధన మానుకుంటున్నాడు. ఒకవంక శిరిడీ రావడం గురుద్రోహమనుకుంటున్నాడు. మరొక వంక తానర్పించిన పిండం బాబా స్వీకరిస్తే, ఆయనా తన గురువూ ఒక్కరేనని నమ్ముతాననుకొన్నాడు.




కాని అలా జరిగినా గూడా బాబా దుష్టుడైన మాంత్రికుడన్న భావం విడువలేకపోయాడు. ఒకవంక తన మొదటి గురువునుగూడా అతడు గురువుగా అంగీకరించనన్న షరతుమీదనే ఆమె దగ్గర ఉపదేశం తీసుకున్నాడు. కాని అటు తర్వాత శిరిడీకి బయలుదేరగానే ఆమెయే తన గురువని, శిరిడీ రావడం గురుద్రోహమనీ తలచాడు. అందుకే అతని గురించి బాబా 'పిచ్చివాడు' అని మొదటనే చెప్పారు.

ఇతని విషయములో బాబా గురించిగూడ మనం గమనించవలసిన అంశమొకటున్నది. ఇంత చిక్కైన మనసుగల భక్తుని తమ చెంతకు తీసుకువచ్చి యింత గొడవ జరిగినందుకు, మరొక గురువైతే రేగే, ఆయీలపై ఎంతో చికాకు పడేవాడు. కాని జరగబోయే గొడవంతా ముందుగా తెలిసినా గూడా, రేగేపై సాయి కించిత్తుగూడ చికాకుపడలేదు. ఆయీ యింట యింత గొడవ జరుగుతున్నా, ఆయీపై గాని, రేగేపై గాని ఆయన కోపగించుకోలేదు. వారిద్దరూ అవస్తేకు భక్తి విశ్వాసాలు కల్గించాలని పడిన తాపత్రయానికి సాయిగూడా వారిపై దయతో దోహదం చేయాలని చూచారు. అవస్తే తెచ్చిన పిండాన్ని ఆయన అడిగి స్వీకరించి అతడు కోరిన నిదర్శనమిచ్చారు. అది కేవలం ఆయీ, రేగేలను తృప్తి పరచడానికే! అతడికెలాగూ పిచ్చి పట్టబోతుందని ఆయనకు ముందే తెలుసు. కాకుంటే వాళ్ళ సంకల్పం మంచిది గనుక ఆయన వాళ్ళనేమీ అనలేదు.

పై కారణాలన్నింటి వలన నాటి సాయి భక్తులందరూ రాధాకృష్ణ ఆయీని ఎంతగానో గౌరవించేవారు. ఆమె ఆంతర్యం అర్థం చేసుకోలేని కొద్దిమంది మాత్రం అతి నిరాడంబరులైన సాయి సన్నిధిలో ఆమె ఎంతో ఆడంబరం చేస్తున్నదని, సాయిని గురించి ప్రచారం చేయించి శిరిడీలో జనసమ్మర్దం పెంచుతున్నదనీ ఆమెను విమర్శిస్తుండేవారు. సాధనలోని లోతుపాతులు ఆమెకు తెలిసినంతగా వారికేమి తెలుసు? అంతేకాదు, అట్టి వారి హృదయాలలో వారికి తెలియకుండానే ఒక బలహీనత యిలా తొంగి చూస్తుంది. ఇంకొకరిని, అందులోనూ సాటి మానవాకృతిని అందరూ పూజించడం మనలోని అహంకారం సహించలేదు. అట్టి అవివేకంతో ఒకసారి దాసగణు ఆమెను ఎంతో తీవ్రంగా విమర్శించాడు. తర్వాత అతడు సాయిని దర్శించినపుడు ఆయన, "కీర్తనల ద్వారా నీవు చేస్తున్నది గూడా అలాంటిదే కదా? ఎన్నడూ ఎవరినీ అలా విమర్శించవద్దు" అని మందలించి, ఆయీకి నమస్కరించి చెంపలేసుకుని క్షమాపణ చెప్పమని ఆదేశించారు, అతడలానే చేసాడు. అందువలన తనలో అహంకారం తొలగిపోయిందని దాసగణు గూడా సంతోషించాడు.

సాయిసంకల్పంఏమోగానిఆమెఅంతశీఘ్రంగానూ అందరి అభిమానాన్ని కోల్పోయింది. చివరకు సాయి గూడ, మశీదు పరిసరాలకు గాని, తాము నిత్యము వెళ్ళే ప్రదేశాలకుగానీ ఆమె వెళ్ళరాదని శాసించారు.

ఆమె చివరిరోజులు ఎంతో బాధాకరంగా గడిచాయి. ఒకరోజు ఆమె తన గదిలోనే అకస్మాత్తుగా మరణించింది. కొద్ది రోజుల తర్వాతగాని ఆ సంగతి భక్తులెవరూ గుర్తించలేదు. కొందరు అభిమానులు ఆమె దేహాన్ని శిరిడీలోనే సమాధి చేయాలని అడిగితే బాబాకోపంతో సుతరామూ ఒప్పుకోలేదు. కొందరు మహర్లచేత ఆమె దేహాన్ని కోపర్గావ్ లోని ప్రభుత్వాసుపత్రికి శవ పరీక్షకు పంపారు. అటు తర్వాత ఆమె దేహాన్ని కోపర్గావ్ లోనే గోదావరి ఒడ్డున దహనం చేశారు. భక్తులందరూ ఆమెనంతగా కీర్తించడం ఆధ్యాత్మికంగా ఆమెకంత శ్రేయస్కరం గాదని తలచి సాయి అలా జరగనిచ్చారేమోనని తలచవచ్చు. అయితేనేమి? ఆమె రూపొందించిన శిరిడీ సంస్థానము, ఆమె ప్రారంభించిన ఆరతులు, ఉత్సవాలు నేటికీ శిరిడీలోనూ, దేశమంతటా గూడ మనను సన్మార్గానికి ఆహ్వానిస్తున్నాయి.

### శ్రీమతి బిక్కూబాయి:

ఎందరో భక్తులు వచ్చి శిరిడీలో స్థిరపడి జీవిత శేషమంతా సాయి సేవలో గడిపిన వివరం సాయి చరిత్ర గ్రంథాలలో చూస్తాము. కాని అలా చేసిన భక్తురాళ్ళెక్కువ మంది గురించి మనకు తెలియదు. అలా చేసిన భక్తురాలు రాధాకృష్ణ ఆయీ ఒక్కతేననుకుంటాము. నిజానికి మరి ఒకరిద్దరు స్త్రీలు గూడా వున్నారు. కాకుంటే సాయిసన్నిధి గొప్ప సంస్థానంగా రూపొందేలా చేసిన రాధాకృష్ణ ఆయీ పేరే భక్తులకెక్కువగా పరిచయమవడంలో ఆశ్చర్యం లేదు. శ్రీ సాయిసేవలో జీవితశేషం గడిపిన స్త్రీలలో శ్రీమతి బిక్కూబాయి, శ్రీమతి కాశీబాయి గూడా వున్నారు.

శ్రీమతి బిక్కూబాయి స్వతహాగా అహ్మద్ నగర్ కు చెందినది. రాధాకృష్ణ ఆయీ గూడ ఆ వూళ్ళో వుంటుండగానే సాయి భక్తురాలైంది. ఆమె అప్పుడప్పుడు శ్రీ సాయి గురించి తన స్నేహితురాలైన బిక్కూబాయితో చెబుతుండేది. బాలవితంతువైన ఆయీ తన జీవిత శేషమంతా సాయి సన్నిధిలో, సాయి సేవలో గడపాలనుకుంటున్నానని బిక్కూబాయితో చెబుతుండేది. బిక్కూబాయికి ఒక సైనికోద్యోగితో సంగమనేరులో వివాహమైంది. ఆమె భర్త శిరిడీకి చెందిన బయ్యాజీపాటిల్ కోతే. అతడు ఉద్యోగరీత్యా సంగమనేరులో వుండేవాడు. కాని కొద్ది సంవత్సరాలలోగానే దురదృష్టవశాత్తు ఆమె భర్త మరణించాడు. అంతకు కొద్దిముందే రాధాకృష్ణ ఆయీ శిరిడీలో స్థిరపడింది.

ఆ రోజులలో పంజర్ గామ్ నుండి గంగగిర్ బాబా వచ్చి, శిరిడీలో వాడా వద్ద చింతచెట్టు క్రింద నామ సప్తాహం చేయిస్తున్నారు. దానికి నిత్యమూ ఎన్నో ప్రాంతాలనుండి భక్తులు వస్తుండేవారు. అలానే సంగమ్నేరు నుండి గూడ ఒక భక్త బృందం శిరిడీచేరి ఆ సప్తాహంలో పాల్గొన్నది. ఆ బృందంవారు తిరిగి వెళ్ళేప్పుడు వాళ్ళ ద్వారా రాధాకృష్ణ ఆయీ ఒక బాబా పటము, కొంచెం బాబా ప్రసాదము బిక్కూబాయికి పంపుతూ, ఆమెనుగూడ శిరిడీవచ్చి బాబాను దర్శించి కొద్ది రోజులుండి బాబాసేవ చేసుకొమ్మని కబురు పంపింది. బిక్కూబాయి శిరిడీ వచ్చి కొద్దిరోజులుండి మరలా అహ్మద్ నగర్ వెళ్ళిపోయింది. అలా ఆమె అప్పుడప్పుడూ వచ్చి బాబాను దర్శిస్తుండేది. ఇది ఆమెకు సాధ్యం గావడానికి ఆమెకొక సౌలభ్యం గూడా వుండేది. సైనికోద్యోగి భార్య వితంతువుగా ఆమె ప్రతినెలా సంగమ్నేరు నుండి అహ్మద్ నగర్ వెళ్ళి పింఛను తీసుకోవలసి వున్నది. అందుకోసం బయల్దేరినపుడల్లా కోపర్గాంలో గోదావరి స్నానంచేసి, శిరిడీవచ్చి సాయిని దర్శించి, కొన్నేసి రోజులక్కడుండి వెళుతుండేది. మొదటిసారి ఆమె శిరిడీ వచ్చినపుడు సాయి ఆమెను, "నీవు ఆయీ యింట్లోవుండి, నిర్విరామంగా సేవచేస్తుండు" అని ఆదేశించారు. ఆ ప్రకారమే ఆమె ఎప్పుడు శిరిడీ వచ్చినా ఆయీ యింట్లోనే బస చేస్తుండేది. అలా యిద్దరికీ ఎంతో ఆత్మీయత, అనుబంధమూ ఏర్పడ్డాయి.

దురదృష్టవశాత్తూ 1916 లో రాధాకృష్ణ ఆయీ మరణించింది. ఆమె దేహాన్ని కోపర్గావ్ లో గోదావరి ఒడ్డున దహనం చేసిన సంగతి గుర్తొచ్చి ఆ శోకంతో బిక్కూబాయి తెచ్చిన మాల, నైవేద్యము బాబా స్వీకరించలేదు. అటు తర్వాత ఆమె కొంతకాలం శిరిడీలో వుండిపోయింది. బాబా ప్రతిరోజూ మధ్యాహ్నం ఆమెకొకపాత్ర నిండుగా భోజనమిస్తే ఆమె దానిని తీసుకుపోయి తినేది.


# ద్వారకామాయి అనుభవమండపము

*శ్రీమతి పద్మజా రెడ్డి , హైదరాబాద్*

అది, 1989 వ సంవత్సరం. ఒకరోజు మధ్యాహ్నం 12 గంటల సమయంలో, రాణిగంజ్ ఏరియాలో, ఒక సందులో నడుస్తున్నాను. దాదాపు రోడ్లన్నీ నిర్మానుష్యంగా వున్నాయి. ఒకతను నా వెనకే వస్తూ, నడక వేగం పెంచాడు. అంటే తరుముతున్నట్లు వేగంగా వస్తున్నాడు. నేనూ నడక వేగం పెంచాను. నాచెయ్యి పట్టుకోవాలని ప్రయత్నం చేస్తున్నాడు. .నాకేం చెయ్యాలో తెలియక పరుగుపెట్టడం మొదలుపెట్టి, పక్కనే బాబా గుడి ఉంటే అందులోకి వెళ్లాను. మధ్యాహ్న ఆరతి అవుతోంది. బాగా భయం వేసింది, వాడు కూడా లోపలకి వచ్చేస్తాడేమోనని. వాడు నన్నేమి చెయ్యకూడదని, నాకు కనపడకూడదని బాబాకి దణ్ణం పెట్టుకున్నాను! 'ఈ కష్టంనించి తప్పించినట్లైతే, ప్రతి గురువారం మీకు పూజ చేసి, ఉపవాసం వుండి, మిమ్మల్ని నా ఇలవేల్పుగా కొలుచుకుంటాను' అని మొక్కుకున్నాను. తరవాత అతను నాకు కనపడలేదు. ఆవిధంగా బాబా నా జీవితంలోకి ప్రవేశించారు.

1990 లో నాకు పెళ్లయ్యింది. అనుకున్నట్లుగానే ప్రతి గురువారం బాబాకి పూజ, ఉపవాసం చేసేదాన్ని. ప్రతి సంవత్సరం షిరిడీకి వెళ్ళేవాళ్ళం. ఒకసారి శిరిడి వెళ్ళినప్పుడు, సాయి సచ్చరిత్ర కొన్నాను. అప్పటినించి పారాయణ చెయ్యడం మొదలుపెట్టాను. 1992 లో సొంతంగా ఒక కంపెనీ పెట్టాము. కొన్నాళ్ళకి దాంట్లో బాగా నష్టాలొచ్చాయి. నాకు సంతానం కూడా కలగలేదు. దాదాపు 5 సంవత్సరముల వరకు పిల్లలు పుట్టలేదు. మా ఇంట్లో వాళ్ళు నన్ను చాలా ఇబ్బంది పెట్టేవాళ్ళు. నేను ప్రతిరోజూ బాబాముందు కూర్చుని, పారాయణ అయ్యాక "ఒక పక్క సంతానం లేదు, ఒకపక్క ఆర్థిక సమస్యలు, నిన్నే నమ్ముకున్నాను కదా, నాకెందుకిన్ని కష్టాలు" అని చెప్పుకుని బాగా ఏడ్చేదాన్ని. కొన్నాళ్ళకి నేను గర్భవతిని అయ్యాను. అప్పుడు బాబాకి, "పాప అయినా, బాబు అయినా ఫరవాలేదు, నీ పేరు పెట్టుకుంటాను, బిడ్డని తీసుకుని షిరిడీకి వస్తాను" అని మొక్కుకున్నానుకొన్నాళ్ళకి నాకు పాప పుట్టింది. 'సాయి శ్రావణి' అని పేరు పెట్టుకున్నాము, కానీ శిరిడికి మాత్రం తీసుకుని వెళ్లలేక పోయాము. ఏదో కారణంతో వెళ్ళడానికి కుదిరేది కాదు. ప్రతి సంవత్సరం తన పుట్టినరోజుకి, తీవ్రంగా జబ్బుచేసి, హాస్పిటల్ కి తీసుకుపోయేంత పరిస్థితి వచ్చేది. ఆఖరికి పాపకి 5 వ సంవత్సరం పుట్టినరోజుకి శిరిడీ వెళ్లాలని రైలు టిక్కెట్లు సిద్ధం చేసుకున్నాము. తాను స్కూల్ కి వెళ్ళింది. రాగానే బయలుదేరాలి. కానీ పాప స్కూల్ నించి వస్తూనే, వొళ్ళంతా దద్దుర్లు, విపరీతమైన జ్వరంతో వచ్చింది. మావారైతే పాపని చూసి ఏడ్చేశారు.

ఏమైనాసరేశిరిడీకితీసుకెళ్లాలని, రైలులో వెళితే మన్మాడులో దిగి మళ్ళీ బస్సు ఎక్కాల్సివస్తుందని, ఆ టిక్కట్లు రద్దుచేసి, బస్సుకి తీసుకున్నాము. బస్సు అయితే డైరెక్ట్ గా శిరిడి వరకు వెళుతుంది కనక! బస్సు ఎక్కాక మళ్ళీ బాబాకి మొక్కుకున్నాను,,,"మేము శిరిడీలో దిగేవరకు నా పాపకి బాగైపోవాలి" అని. బాబా యెంత



కరుణామయులంటే, మర్నాడు ఉదయం శిరిడీలో దిగేసరికి, మా పాప మామూలుగా అయిపోయి, బస్సు దిగి పరుగు పెట్టింది. ఒంటిమీద ఒక్క దద్దురుగాని, జ్వరంకాని ఏదీ లేదు. ఆరోజు బాబాకి ప్రత్యేక పూజలు అవి చేయించుకుని, శిరిడీలో నిద్ర చేసి, మర్నాడు బయలుదేరి హైదరాబాద్ కి వచ్చాము. అప్పటి నించి మానకుండా ప్రతి సంవత్సరం షిరిడీకి వెడతాము. అలా ఒకసారి శిరిడీ వెళ్ళినప్పుడు, నాకు అక్కడ ఇంకొక రోజు వుండాలని వుంది, మావారేమో వెళ్ళిపోదాం అంటున్నారు. ఆరోజు నేనొక్కదాన్నే, పాపని పక్కన కూర్చోపెట్టుకుని ఇదేవిషయం ఆలోచిస్తున్నాను. నా పక్కనే, కాషాయ వస్త్రాలు కట్టుకుని, పొడుగ్గా వున్న ఒకాయన వచ్చి నిల్చుని, హిందీలో, “ఈరోజు వెళ్లితీరాలా” అని అడిగారు. నేను ఏదో ఆలోచనలో, ఔనన్నట్లు తలవూపి, ఔనూ ఈవిషయం ఇతనికెలా తెలుసన్నట్లు అతనివైపు తేరిపార చూడగానే, మరుక్షణం ఆయనక్కడ లేరు.

2002 లో మాకు మళ్ళీ పాప పుట్టింది. తనకి సాయి శృతి అని పేరుపెట్టుకున్నాము. పుట్టువెంట్రుకలు షిరిడీలోనే తీయించాము. మా చిన్న పాప పుట్టేవరకు, జీవితంలో చాలా ఒడిదుడుకులు ఎదురుక్కున్నాము. తను పుట్టిన కొన్ని రోజులకి ఒక మంచి కంపెనీలో ఉద్యోగం దొరికింది. అక్కడ “సాయిబాబా” మాస పత్రిక చూసాను. మా పర్సనల్ మేనేజర్ గారు, పూజ్యశ్రీ భరద్వాజ మాస్టర్ గారి గురించి చెప్పి, శ్రీ గురుచరిత్ర పారాయణ చెయ్యమన్నారు. తరవాత శిరిడీ వెళ్ళినప్పుడు, ఆ గ్రంథం, దానితోపాటు శ్రీ సాయిలీలామృతం కూడా కొనుక్కుని పారాయణ చేయడం మొదలుపెట్టాను. తరవాత తెలిసింది, పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారి కుటుంబం నాగోల్ లో వున్నారని!

మా పెద్దపాప పెళ్లయ్యింది. చిన్నమ్మాయి ఇంజనీరింగ్ లో చేరింది. ఇప్పుడు ప్రస్తుతము కుటుంబ పరిస్థితులు చక్కపడ్డాయనే చెప్పవచ్చు. ఆపద నించి తప్పించుకోవడానికి బాబా గుడికి పరుగెత్తిన నన్ను, అక్కున చేర్చుకుని, నా జీవితంలో ఎన్నో సంఘటనల్లో తోడూనీడగా వుండి, నన్ను నడిపిస్తున్న బాబా, నాకు ఆయన సేవని కూడా ప్రసాదించారు. మా ఇంటిపక్కనే బాబా గుడి వుంది. ఉదయాన్నే ఆరతి కంటే ముందే వెళ్లి, సేవ చేసుకుని, తరవాత కాకడ ఆరతి అయ్యాక , ఇంటికి వస్తాను. నాకు పెద్దదిక్కు, నా ఇంటి ఇలవేల్పు, నా సర్వస్వం సమర్థ సద్గురుడైన శ్రీ సాయినాథ్ మహారాజ్ వారే !! •

# ఆచార్యుని అద్భుత లీలలు

**శ్రీమతి సుజాత, బాపట్ల**

పూజ్యశ్రీ భరద్వాజ మహారాజ్ లీలావైభవాన్ని, బాపట్ల వాస్తవ్యులు శ్రీమతి సుజాతగారు ఈవిధంగా తెలియచేస్తున్నారు.

2012 సం.లో మేము శ్రీమతి విజయలక్ష్మి గారింట్లో అద్దెకి వుండేవాళ్ళం. వాళ్ళ ద్వారా శ్రీ కోటేశ్వరరావుగారు నిర్వహించే సత్సంగాలకి వెళ్ళడం జరిగింది. ఒకసారి గురుపూర్ణిమకి, మా ఇంట్లో వున్న మామిడి చెట్టుకింద, మమ్మల్నందరిని 'శ్రీ గురుచరిత్ర' పారాయణ చెయ్యమన్నారు. నేను అదే మొదటిసారి గురుచరిత్ర చదవడం. చాలా శ్రద్ధ పెట్టి చదివాను. మర్నాడు పూజ్యశ్రీ మాస్టరుగారు ఒక హాలులో కూర్చుని వున్నట్లుగా స్వప్నదర్శనం అయింది. ఆయన ముందు సమాధి వుంది. సత్సంగ సభ్యులతో చెప్తే, అది ఒంగోలులో సమాధి మందిరం అని చెప్పారు.

మావారు సత్సంగానికి వచ్చినరోజున, బాబా పటం పక్కనే మాస్టరుగారి పటం చూసి, "బాబా అయితే దేవుడు, కానీ మాస్టరుగారు మనలాగే ఉద్యోగం చేస్తూ, గృహస్థుగా వున్నారు, ఈయనని దేవుడిలా కొలుస్తున్నారేమిటా?" అని ఒకరకమైన భావన వచ్చిందిట. రెండు మూడు రోజుల తరవాత పూజ చేసి పారాయణ చేసుకుంటుంటే, మళ్ళీ మనసులో అదే భావన చాలా తీవ్రంగా అనిపించిందిట. అదే రోజు రాత్రి స్వప్నంలో రెండు ఇసుక కుప్పలు -- ఒకటి సిమెంటులో కలిపే ఇసుక, రెండవది ఫిల్లింగులో వాడేది -- ఒకదాని పక్కన ఒకటి ఉన్నాయిట(మావారు సివిల్ వర్క్స్ చేస్తారు). ఎవరో, "ఈ రెండూ ఒకటే, తేడాలేదు" అంటున్నారట. మావారు, "తేడా ఎందుకులేదు? ఒకటి బరకగా ఉంటుంది, ఒకటి సన్నగా ఉంటుంది" అన్నారుట. అవతలివారు "తత్వతః ఒకటే కదా!" అన్నారట. అప్పుడు మావారికి — పైకి రూపాలు, వ్యవహారం తేడాగా వున్నా, పూజ్యశ్రీ మాస్టరుగారు, శ్రీ సాయిబాబా తత్వతః ఒక్కటేయనీ, తేడా లేదని అర్థమయ్యిందట. అప్పటినించి, పూజ్యశ్రీ మాస్టరుగారు రాసిన గ్రంథాలన్నీ పారాయణ చేస్తూ, సత్సంగాలకి హాజరవ్వడం మొదలు పెట్టారు.

నేను ఒకసారి మా స్నేహితుల కుటుంబంతో ఒంగోలు పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధి దర్శనానికి బయలుదేరాను. కానీ రైల్వేస్టేషనుకి వచ్చేసరికి, మా స్నేహితులు రాలేదు. రైలు బయలుదేరిపోతోంది. నాకు చాలా భయమేసింది. నేను ఎప్పుడూ ఒంటరిగా ఎక్కడకి వెళ్ళలేదు. ఏమైతే అయ్యిందని, పూజ్యశ్రీ మాస్టరుగారికి నమస్కారం చేసుకుని రైలు ఎక్కేసాను. రైలులో కూర్చున్నాక 'ఒంగోలులో ఏమి తెలియదు ఎలా వెళ్ళాలి' అనిపించి, 'ఎవరికెవరూ తోడుకాదు, మాస్టరుగారూ మీరొక్కరే అందరికి తోడు' అనే భావనతో వారికి నమస్కరించుచున్నాను. మావాళ్ళు వేరే రైలు ఎక్కి, చీరాలలో నన్ను కలిశారు. ఒంగోలులో సమాధి మందిరానికి వెళ్ళాక మనసు చాలా ప్రశాంతం అయిపోయి, కళ్ళు మూతలు పడిపోయాయి. అలా చాలాసేపు వుండిపోయాను. నాకు ధ్యానం చెయ్యడం రాదు. 'ఒంగోలు పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధి దగ్గరకి వెళ్ళినప్పుడు, అక్కడ ధ్యానం చెయ్యాలి' అనుకున్నాను. అలా పూజ్యశ్రీ మాస్టరుగారు నాచేత ధ్యానం చేయించి మంచి అనుభవాన్ని ప్రసాదించారు.

మేము ఇల్లు మారినప్పుడల్లా పూజ్యశ్రీ మాస్టరుగారి పాదుకలు (సత్సంగ మందిరం నించి ) తెచ్చుకుని, రెండు మూడు రోజులు సేవించుకుని

తిరిగి ఇచ్చేసేవాళ్ళం. వారి పాదుకలు ఎన్నో లీలలు చేశాయి. ఒకసారి ఇలాగే పాదుకలు తెచ్చుకున్నాక, మధ్యాహ్నం భోజనం నివేదన ఇచ్చి, ఆరతి చేసి అక్కడే కింద పడుకున్నాను. దాదాపు 3 గంటలనించి మంచి కాఫీ వాసన ఇల్లంతా వస్తోంది. చుట్టూ చూసాను. ఎవరి ఇంట్లోంచి కాదు, మా ఇంట్లోంచే వస్తోంది. దాదాపు గంటసేపు కాఫీ ఘుమఘుమలతో ఇల్లంతా నిండిపోయింది. పూజ్యశ్రీ మాస్టరుగారికి కాఫీ పెట్టి ఇవ్వాలని అప్పుడు నాకు అర్థమయ్యింది. మాకు కాఫీ తాగే అలవాటు లేదు. అందుకే కాఫీ ఇవ్వాలన్న ఆలోచన రాలేదు. బ్రూ కాఫీ కలిపి నివేదన చేశాను. పూజ్యశ్రీ మాస్టరుగారే ఇంట్లో వ్యక్తిలాగ అడిగి చేయించుకున్నట్లు అనిపించి, చాలా సంతోషం వేసింది.

కొన్ని రోజులు మేము మా అమ్మవాళ్ళ ఇంట్లో వుండేవాళ్ళం. మా నాన్నగారికి కొద్దిగా డ్రింకింగ్ (తాగుడు) అలవాటయ్యింది. దాంతో చాలా ఇబ్బందిగా ఉండేది. మేము ప్రతి సంవత్సరం గురుదంపతులకు కళ్యాణం చేసుకుంటాం. ఒకరు పూజ్యశ్రీ అమ్మగారిని పెళ్లికూతురు చేయడానికి తీసుకువెళితే, వేరొకరు పూజ్యశ్రీ మాస్టరుగారిని పెళ్లికొడుకు చెయ్యడానికి తీసుకువెడతారు. ఆ సంవత్సరం మాకు పూజ్యశ్రీ మాస్టరుగారిని పెళ్ళికొడుకుని చెయ్యడానికి అవకాశం వచ్చింది. అందుకని మేము అమ్మవాళ్ళ ఇంట్లో వున్నప్పుడు తీసుకెళ్ళాను. ఆరోజు రాత్రి అమ్మ, నాన్నతో సహా అందరం, హాలులో పూజ్యశ్రీ మాస్టరుగారు (పటం రూపంలో) వున్నారని, అక్కడే పడుకున్నాము. తెల్లవారి లేచాక మా నాన్న "నాకేదో గాబరాగా వుంది, నేనేదో తప్పుచేస్తున్నాను అనిపిస్తోంది, ఏమిటో తెలియడంలేదు" అంటే, మా చిన్న పాప తాగడం మానెయ్యమని చేతితో సైగ చేసి చెప్పింది. వెంటనే మా నాన్న పూజ్యశ్రీ మాస్టరుగారి దగ్గరికి వచ్చి, నమస్కారం చేసుకుని "ఈరోజు నించి నేను తాగను" అని ప్రమాణం చేశారు. అంతే! వెంటనే మానేశారు. ఇప్పటికి నాలుగైదు సంవత్సరాలు అవుతుంది. మధ్యలో ఎన్నో విధాల అందరూ పరీక్షించినా మా నాన్న మళ్ళీ తాగలేదు.

ఇలాగే ఇంకొకసారి పూజ్యశ్రీ మాస్టరుగారి పాదుకలు తీసుకెళ్లినప్పుడు, మేము చీరాల మా బావగారి ఇంటికి నోములకు వెళ్ళవలసి వచ్చింది. పూజ్యశ్రీ మాస్టరుగారి పాదుకలు పెట్టుకుని పూజ చేసుకుందామని అక్కడకి తీసుకువెళ్లాను. మా అత్తగారి ఇంటిలో అందరూ పారాయణ చేస్తారు. పూజ్యశ్రీ మాస్టరుగారి పాదుకలు తీసుకెడితే వాళ్లకి చాలా సంతోషం. మా బావగారి అమ్మాయికి చెయ్యాలనుకున్న ఒక పెళ్లి సంబంధం సంవత్సరం నించి తాత్సారం జరుగుతోంది. మేము వెళ్లిన మర్నాడే, ఆ సంబంధం రద్దు అయ్యి ఒక వారంలోనే ఇంకొక సంబంధం కుదిరి, తొందరలోనే పెళ్లి కూడా అయిపోయినది. ఆ మొదటి సంబంధం మంచిది కాదని తరవాత తెలిసింది. ఈవిధంగా పూజ్యశ్రీ మాస్టరుగారు, వారి పాదుకలు ఎన్నో జీవితాలని నిలబెట్టాయి.

పూజ్యశ్రీ మాస్టరుగారిని, బాబాగారిని పూజించే విషయంలో మా తమ్ముడికి, మాకు బాగా గొడవలు జరిగేవి. మేము సత్సంగాలకు వెళ్ళటం ఇష్టముండేదికాదు. 'ఈ బాబాలు, గురువులు మనకెందుకు? చిన్న పిల్లల చదువులు దెబ్బతింటాయి' అనే అభిప్రాయంలో ఉండేవారు. వాళ్లకి పెళ్ళయ్యి 8 సంవత్సరములైనా పిల్లలు పుట్టలేదు. చాలా మొక్కులు మొక్కుతున్నారు, యాత్రలకి వెడుతున్నారు. నేను పారాయణ చెయ్యమని చెప్తుంటే చెయ్యటం లేదు. ఒకసారి మా ఇంటికి వచ్చినప్పుడు కోటేశ్వరరావు అంకుల్ దగ్గరకి తీసుకెళ్ళాను. ఎలాగో ఒప్పుకుని వచ్చారు. ఆయన వాళ్లకి ,శ్రీ సాయి లీలామృతం, శ్రీ గురుచరిత్రతో పాటు కొన్ని మహాత్ముల గ్రంథాలు యిచ్చారు. ఒకొక్క గ్రంథం పారాయణ అవ్వగానే, ఆ క్షేత్రానికి దర్శనానికి వెళ్ళమని చెప్పారు. అలాగే వాళ్ళు కూడా చేశారు. ఇప్పుడు వాళ్లకి బాబు పుట్టాడు. దానితో వాళ్లకి కూడా మాస్టరుగారన్నా, బాబా అన్నా నమ్మకం కుదిరింది. ఈవిధంగా పూజ్యశ్రీ మాస్టరుగారు నా పుట్టింటి వాళ్లలో కూడా మార్పుని తీసుకొచ్చి, కుటుంబమంతటికి వారి అనుగ్రహాన్ని ప్రసాదిస్తున్నారు.

ఇలా మేమందరం సాయిమాస్టర్ బాటలో పయనిస్తూ మా జీవనం ప్రశాంతంగా సాగిస్తున్నాము. మాలో భక్తి విశ్వాసాలు పెంపొందించి, మా చేయి వదలకుండా పట్టుకొమ్మని పూజ్యశ్రీ మాస్టరుగారిని ప్రార్థిస్తూ, కృతజ్ఞతా పూర్వక నమస్సుమాంజలులు సమర్పించుకొంటున్నాను.

జై సాయి మాస్టర్ !

# వార్తాలాపము

17వ పేజీ తరువాయి

వాచికము (వాక్కుతో ఆచరించేది), మానసికము (మనసుతో ఆచరించేది) అని మూడు విధాలు.

కాయికమైన తపస్సు భగవద్గీతలో, 'వ్రతోపవాసనియమైః శరీరోత్తాపనం తపః' అని చెప్పబడింది. వ్రతాలు, ఉపవాసాలు, నియమాలు మొదలైనవాటి చేత శరీరాన్ని తపింపచేయటం శారీరకమైన తపస్సు.

వాచికమైన తపస్సు అంటే సత్యం పలకడం, అనవసరమైన సంభాషణ చేయకపోవడం, ఎవరినీ నిందించకుండా వుండడం, కఠినమైనటువంటి మాటలను పలకకుండా వుండడం.

వాచిక, మానసిక తపస్సుల గురించి మహాభారతంలో ఇలా వున్నది–

శ్లో॥ *అహింసా సత్యవచనం*
*ఆనృశంస్యం దమో ఘృణా ।*
*ఏతత్తపో విదుర్ధీరా*
*న శరీరస్య శోషణమ్ ॥*

భావం: అహింస, సత్యము, ఇతరులను బాధపెట్టే పనులు చేయకపోవడము, దమము, దయ – ఇవి మానసికమైన తపస్సు. శరీరాన్ని శోషింపజేయడం (బాధించడం) మాత్రము తపస్సు కాదు. ఉపవాసము మొ॥న వాటివలన శరీరాన్ని బాధపెట్టడం వలన తపస్సిద్ధి కలుగదు. ఈ విషయంలో పరమేశ్వరుడు పార్వతీ దేవితో ఇలా అన్నాడు.

శ్లో॥ *దేహదణ్డన మాత్రేణ*
*కా ముక్తి రవివేకినామ్ ।*
*వల్మీకతాడనాద్దేవిః*
*మృతః కిం సు మహోరగః ॥*

భావం: ఓ దేవీ! శరీరాన్ని కష్టపెట్టినంత మాత్రాన ఆ అవివేకికి ముక్తి కలుగుతుందా? పాము పుట్టమీద కొట్టినంత మాత్రాన సర్పము మరణిస్తుందా? ఇంకా శాస్త్రము ఇలా చెబుతున్నది –

శ్లో॥ *మాసపక్షోపవాసేన*
*మన్యన్తే యే తపో జనాః ।*
*ఆత్మతన్తూపఘాతాస్తే*
*న తపస్తత్సతాం మతమ్ ॥*

భావం: మాసము, పక్షము రోజులపాటు ఉపవాసము వుండడం 'తపము' అనుకుంటారు. వారు ఆత్మతంతువును (ఆత్మ అనే తీగను) నశింపజేస్తారు. సత్పురుషులు దానిని తపస్సుగా అంగీకరించరు.

ఆత్మతంతువును నశింపజేయడమంటే శరీరాన్ని నిలబెట్టే ఆధారాన్ని నశింపజేయడము.

**- సశేషం**

# పరిప్రశ్న

06వ పేజీ తరువాయి

ప్రేమతో చూచుకోగల్గి, తల్లిదండ్రులను, భార్యాబిడ్డలను సోదరులను, అందరినీ ప్రేమగా చూచుకోగల్గడం వలన మానవ జీవితమొక ప్రేమ స్రవంతిగా సాగుతుంది. నేడు సామాన్యమైన సౌఖ్యాలెన్ని వున్నా ప్రతివాడు స్వార్థమనే తీరని ఆకలితో మల మల మాడుతూనే యున్నాడు. వివాహంలో భార్యకంటే ధనము, మర్యాద, లాంఛనాలు ముఖ్యమయ్యాయి. తల్లిదండ్రులకు వారిచ్చే తృప్తి హోదాలవల్లనే భార్యాబిడ్డలనుండి గౌరవం లభించే దుస్థితి కల్గింది. డబ్బు, ఆస్తి మొదలయినవి తన వినియోగం కోసం సృష్టించిన మనిషి – తనకంటే వాటికే ఎక్కువయిన విలువనిచ్చుకొనే బానిస బుద్ధికి దిగజారాడు.

ఈ వైఖరి క్రమంగా మనలో మార్పురానిదే వేదవిద్య మృతంగా వుండిపోతుంది. పరీక్ష కోసం గుడ్డిగా వల్లించిన పాఠాలలాగ. ఆ మార్పు రావాలంటే శ్రీ సాయిబాబావంటి పూర్ణగురుని సేవిస్తే అన్ని జీవులలో ఆయనే వున్నారన్న వివేకము, తద్వారా సర్వ జీవులపట్ల ప్రేమ, గౌరవము ఏర్పడతాయి. అప్పుడు మన జీవితాలను పూర్ణం చేసుకోవాలన్న నిజమైన జిజ్ఞాస కల్గి వేదవిద్యను సక్రమంగా అధ్యయనం చేసే సంస్కారం ప్రజలకు కలుగుతుంది.

## పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

**SRI GURUPADUKA PUBLICATIONS, C/o.SRI MANGA BHARADWAJA TRUST**

**Regd.Office:** Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole, Hyderabad-68.

Phone: +91 - 74160 41550

**Branch Office** : Kondaiah Bunk Street, Kothapeta, Ongole, Prakasam Dist. Andhra Pradesh.

Phone:08592 233271

Send DD in favour of **"Sri Manga Bharadwaja Trust (Publications)", payable at Hyderabad or Ongole.**

| | |
|---|---|
| శ్రీ సాయి లీలామృతం-శ్రీ గురు చరిత్ర (Bound) | 450-00 |
| శ్రీ సాయి లీలామృతం | 150-00 |
| శ్రీ గురు చరిత్ర | 150-00 |
| శ్రీ సాయి సన్నిధి | 120-00 |
| శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు | 125-00 |
| శ్రీ సాయినాథ ప్రభోధామృతము | 80-00 |
| సాయినాథ పూజ | 40-00 |
| సాయినాథ స్థవనమంజరి | 10-00 |
| శిరిడి ఆరతులు | 15-00 |
| సాయిబాబాను సేవించడమెందుకు | 10-00 |
| సత్సంగము - భజన | 5-00 |
| శిరిడి క్షేత్ర సందర్శనము | 40-00 |
| విజ్ఞాన వీచికలు | 99-00 |
| పరిప్రశ్న | 99-00 |
| మతమెందుకు? | 20-00 |
| ఏది నిజం? | 25-00 |
| ధ్యానయోగ సర్వస్వం | 99-00 |
| బుద్ధధ్యాన హృదయం | 49-00 |
| దత్తావతార మహత్మ్యం | 75-00 |
| సంహితాయన గురు ద్విసాహస్రి | 125-00 |
| పురుషసూక్త రహస్యం | 40-00 |
| సాయిసూక్తి - ఆచార్యవాణి | 10-00 |
| శ్రీ పాకలపాటి గురువుగారు | 49-00 |
| అవధూత శ్రీ చీరాలస్వామి | 49-00 |
| అవధూత శ్రీ వెంకయ్యస్వామి | 70-00 |
| శ్రీ ఆనందమాయి అమ్మ | 49-00 |
| టిబెట్ యోగి మిలారేపా చరిత్ర | 80-00 |
| శ్రీ హజరత్ తాజుద్దీన్ బాబా చరిత్ర | 49-00 |
| స్వామి సమర్థ (అక్కల్కోట స్వామి) | 49-00 |
| మనము - మన సంస్కృతి | 70-00 |

### ఇతర ప్రచురణలు

| | |
|---|---|
| మహాత్ముల ముద్దుబిడ్డడు | 120-00 |
| అవధూత చివటం అమ్మ | 70-00 |
| శ్రీ సిద్ధారూడ స్వామి చరిత్ర | 70-00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు - పార్ట్-1 | 125-00 |
| మరో నందదీపం | 80-00 |
| ఆచార్య అమృత లేఖావళి | 40-00 |
| భగవాన్ శ్రీ భరద్వాజ | 175-00 |
| బాలల శ్రీ సాయి లీలామృతము | 25-00 |
| మహాపురుషుడు | 50-00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు - పార్ట్-2 | 125-00 |
| బాలల శ్రీ సాయి సన్నిధి | 50-00 |
| బాలల శ్రీ గురు చరిత్ర | 50-00 |
| శ్రీ సాయి మాస్టర్ నిత్యసత్య వ్రతము | 15-00 |
| మాష్టారు అమృత వాక్కులు | 100-00 |

### BOOKS IN ENGLISH

| | |
|---|---|
| Sai Baba the Master | 175-00 |
| Sree Guru Charitra | 99-00 |
| Supreme Master (Swami Samartha) | 99-00 |
| Sai Baba of Shiridi and His Teachings | 99-00 |
| Life and Teachings of Hazarat Tajuddin Baba | 99-00 |
| Children's Sai Baba the Master | 60-00 |

### BOOKS IN OTHER LANGUAGES

| | |
|---|---|
| Sadguru Sai Baba (Hindi) | 150-00 |
| Sai Leelamrutham (Kannada) | 150-00 |
| Sai Baba Jeevitha Charitham (Malayalam) | 220-00 |
| Sai Baba Leelamrutham (Tamil) | 175-00 |
| Sri Guru Charitra (Hindi) | 99-00 |
| Swami Samartha (Kannada) | 50-00 |
| Sri Guru Charitra (Kannada) | 99-00 |
| Shiridi Aarathi (Tamil) | 15-00 |
| Stavana Manjari (Tamil) | 10-00 |
| Tibet Yogi Milarepa Jeevitha Charitra (Kannada) | 55-00 |
| Sri Sainath Prabodhamruthamu (Kannada) | 65-00 |
| Sai Sannidhi (Kannada) | 120-00 |
| Sri Guru Charitra (Malayalam) | 150-00 |
| Sri Guru Charitra (Oriya) | 150-00 |

# ఆధ్యాత్మిక జాగృతి

(మాతృదేవి పూజ్యశ్రీ అలివేలుమంగమ్మ రచించిన వ్యాసముల సంపుటి)



Date of Publication: 21st of each month. Permitted to post: 23rd, 24th, 25th and 26th of each month.
Edited, Printed and Published by Dr. R.S. Sasidhar, Ph.D. trustee of Sri Manga Bharadwaja Trust,
Ongole - 523002. Postal Registration Number : Prakasam/16/2021-2023, Regd.No. 37926/83.



జూలై 13, 2022న గుమ్మళంపాడు శ్రీ మాతృదేవి దివ్య సన్నిధిలో శ్రీ గురుపూర్ణిమ సందర్భంగా గురుపుత్రులు శ్రీ ఎక్కిరాల ద్వారకనాథ్ జ్ఞానేశ్వర్ గారు పూజాదికాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులందరూ భక్తిప్రపత్తులతో పాల్గొన్నారు

IF UNDELIVERED, PLEASE RETURN TO: SRI MANGA BHARADWAJA TRUST, KONDAIAH BUNK STREET, KOTHAPETA, ONGOLE, PRAKASAM DT., A.P. - 523002.